నవతెలంగాణ
నమ్మక తెలుగు దినపత్రిక
మెదక్
1
శుక్రవారం | 06 సెప్టెంబరు 2024 | www.navatelangana.com

జల నిర్బంధంలో కాచాపూర్



రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

నవతెలంగాణ-కోహెడ : భారీ వర్షాల కారణంగా మండల పరిధిలోని కాచాపూర్ గ్రామం జల నిర్బంధంలో ఉందని ట్విన్ విలేజెస్ డెవలప్ మెంట్ ఫోరం కన్వీనర్ లింగంపల్లి. అమర్ నాథ్ తెలిపారు. గత 50 సంవత్సరాల కాలంలో ఇలాంటి సంఘటనలు ఎప్పుడు జరగలేదన్నారు. గ్రామం చుట్టూ మూడు వైపులా వరద ఉధృతి ఎక్కువవడంతో రాకపోకలు నిలిచిపోయాయన్నారు. గతంలో ఎన్ని సార్లు ఊరికి బ్రిడ్జి, రోడ్డు మంజూరు అయినా ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం పనులు చేపట్టిన దాఖలా లేవన్నారు. 2023లో నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్ ఎన్నికల హామీలో భాగంగా "ఏ అవసరం వచ్చినా అందుబాటులో వుంటానని" హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు ఆ హామీ నెరవేర్చే సమయం ఆసన్నమైందని గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా మోక్షం కలగలదన్నారు. ఇప్పటికైనా రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అమర్‌నాథ్, గ్రామ ప్రజలు కోరుతున్నారు

సంగారెడ్డిలో భారీ వర్షంతో అతలాకుతలం



నిత్యం కొనసాగుతున్న రైతుల ఆందోళనలు ..



నవతెలంగాణ -న్యాల్ కల్
డప్పురు గ్రామంలో రైతులు ముక్కుముడిగా ఏకమై ఫార్మసిటి కంపెనీలకు రైతుల భూ సేకరణ వ్యతిరేకిస్తూ గ్రామంలో భూములు ఇచ్చేది లేదంటూ గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. భూ బాధితులు ఫార్మసిటీకీ భూములు కోల్పోతే రైతుల బతుకులు ఆగమాగమవుతాయన్నారు. రైతులకు ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు భూములు గుంజుకునే ప్రయత్నిస్తే ఊరుకోబోమన్నారు. ఐదవ రోజు కూడా రైతులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. రైతులు ఎల్లారెడ్డి , రవికుమార్ , రాజు గౌడ్ , విష్ణు రైతులు గ్రామ మహిళలు ఉన్నారు ..

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు కర్రోళ్ల విజయ్ కుమార్‌కు సన్మానం



నవతెలంగాణ-చేర్యాల :
జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన ఉత్తమ ఉపాధ్యాయుడు చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలకు చెందిన కర్రోళ్ల విజయ్ కుమార్‌ను సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఉపాధ్యాయ శిక్షణ కేంద్రంలో గురువారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఈ.శ్రీనివాస్ రెడ్డి, మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన కర్రోళ్ల విజయ్ కుమార్‌ను టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి, జిల్లా కార్యదర్శి కొడిపల్లి ప్రశాంత్ కుమార్, డిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు దేవులపల్లి కిష్టయ్య, ఎంఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మరాఠి సంతోష్, టీపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి చదరపల్లి నరేష్, పెరిక రాజయ్య, కర్రోళ్ళ నవజీవన్, ఎర్రోళ్ళ శ్రీనివాస్, ఎర్రోళ్ళ గణేష్, రాజు, ప్రసాద్, కర్రోల్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు కొలిపాక బాలమల్లు, కుటుంబ సభ్యులు అభినందించారు.

వేగవంతంగా నిమ్జ్ భూ సేకరణ



నవతెలంగాణ-న్యాల్ కల్
నిమ్జ్ సేకరణ వేగవంతం చేసేందుకు నిమిత్తం గురువారం మెటల్ కుంట, గణేష్ పూర్ , గ్రామాల్లో నిమ్జ్ భూముల సేకరణ చేసేందుకు నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి రెవెన్యూ అధికారులతో పరిశీలించారు. వారి వెంట మండల గిర్దవర్ శ్యామ్ రావు, సర్వేయర్ లాల్ సింగ్, సిబ్బంది ఉన్నారు ..

కాలనీలో పర్యటించిన సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్



నవతెలంగాణ-జహీరాబాద్
లోతట్టు ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణమే స్పందించాలని రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్ గిరిధర్ రెడ్డి అన్నారు. గురువారం జహీరాబాద్ పట్టణంలోని సమీపంలోని అల్లీపూర్, మూస నగర్, పయ్యాజ్ నగర్ లో భారీ వర్షాల కారణంగా చెడిపోయిన రోడ్లు , మురికి కాలువలని సందర్శించి ,ప్రజల సమస్యలు తెలుసుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వెంటనే మరమ్మత్తు లు చేయాలని జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్‌ని ఆదేశించారు. అనంతరం జహీరాబాద్ నుండి అల్గోల్ వేళ్ళే దారిలో బ్రిడ్జి పనులు, రోడ్డు పనులను వేగవంతం చేసి పనులను తొందరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలతో నిండుగా నిండిన కోత్తూరు నారింజ ప్రాజెక్టును పరిశీలించి అధికారులతో మాట్లాడారు. వినాయక చవితి పండుగ సందర్భంగా జహీరాబాద్ మున్సిపల్ భవనంలో ఏర్పాటు చేసిన అన్ని శాఖల అధికారుల సమావేశంలో పాల్గొన్నారు. వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రజలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా,పరిశుభ్రత విషయంలో ఎక్కడ నిర్లక్ష్యం చేయకుండా ఉండాలని, పండుగ సందర్భంగా ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చూడాలని అన్ని శాఖల అధికారులకు ఆదేశించారు. అనంతరం పర్యావరణమే అందరికీ రక్షణ అని , జహీరాబాద్ మున్సిపల్ భవనంలో మట్టి వినాయకుని విగ్రహాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ డివిజన్ అన్ని శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు,సార్వజనిక్ ఉత్సవ కమిటీ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-సంగారెడ్డి
సంగారెడ్డి శాంతినగర్ సెయింట్ ఆంథోనిస్ పాఠశాల ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెయింట్ ఆంథోనీస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ. కరుణాకర్ రెడ్డి , డైరెక్టర్ ఈ.విజయ కుమార్ రెడ్డి , అడ్మినిస్ట్రేటివ్ హెడ్ ఈ.జయబాల రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ ఈ.అరుణా రెడ్డి ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం ముందు జ్యోతి ప్రజ్వలన గావించి, చిత్రపటానికి పూలమాలతో అలంకరించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు .అనంతరం చిరంజీవి అస్మిత బృందంచేత స్వాగత నృత్య గీతం ప్రదర్శించి, కార్యక్రమం ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు ఈ.కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ అజ్ఞానమనే అంధకారాన్ని తొలగించి , విజ్ఞానమనే వెలుగులు ప్రసాదించే చైతన్య శిల్పి గురువు అని అన్నారు. గురువు బ్రహ్మ , విష్ణు, మహేశ్వరులంతటి గొప్ప వారిని కొనియాడారు. అందుకనే గురువు ఉన్నతమైన వ్యక్తి కాబట్టే, ఆదియుగం నుంచి ఆధునిక కాలం వరకు ఆయనే ఋషి సమాజ దేవాలయానికి నిజమైన రక్షకుడు అందుకే మన సమాజంలో అమ్మానాన్నల తర్వాత స్థానం గురువులకు ఇచ్చారు.పాఠశాల డైరెక్టర్ ఈ.విజయ్ కుమార్ రెడ్డి ఉపాధ్యాయ దినోత్సవం గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల డ్యాన్సులు చేశారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు.ఇందులో గెలుపొందిన వారికి పాఠశాల యాజమాన్యం వారు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు..

కంది చెర్వులో... కట్టడాలు



- ఎఫ్‌టీఎల్ పరిధిలో వెంచర్లు
- మూడంతస్తుల ఇళ్లు, స్కూల్, కంపెనీ భవనాలు
- చెర్వు శిఖంలో విస్తరిస్తున్న నిర్మాణాలు
- నీళ్లల్లో ప్లాట్లు చేసి కడీలు నాటిన వైనం
- చోద్యం చూస్తున్న ఐబీ, రెవెన్యూ అధికారులు
- ఇష్టానుసారంగా నిర్మాణాలు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి
ఐఐటీ హైదరాబాద్ పక్కన, హైదరాబాద్-ముంబయి జాతీయ రహదారి వెంట సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఉన్న కంది మండలంలోని భూముల విలువ అమాంతం పెరిగింది. కందిలో ఉన్నత విద్యా సంస్థలు, పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, భారీ వెంచర్లు విస్తరించడంతో రియల భూమ్ పుంజుకుంది. సంగారెడ్డి పట్టణంలో కంటే కందిలోనే భూముల ధరలు అధికంగా ఉన్నాయంటే ఆ ప్రాంతం ఎంత ఖరీదైపోయిందో అర్థమవుతోంది. పట్టా భూముల ధరలు కొనలేనంతగా పెరిగేసరికి చెర్వులు, కుంటలపై కన్ను పడింది. నీటి నిర్వహణ లోపాల వల్ల చెర్వులు, కుంటలన్నీ కబ్జాలతో కనుమరుగవుతున్నాయి. చెర్వు శిఖం భూముల్ని కబ్జా చేసి మట్టితో కప్పేసి వెంచర్లు చేస్తున్నారు. భారీ భవంతులు నిర్మిస్తున్నారు. కంది మండల కేంద్రంలోని చెర్వుతో పాటు మండలంలోని పెద్ద చెర్వు, రామసానికుంట, మల్లన్నగారి కుంట, సిద్దిమ్మకుంట, గంగవానికుంట, ఆరుట్ల కుంటలన్నీ కబ్జాలతో ఆనవాళ్లు కోల్పోతున్నాయి.

కంది చెర్వులో భవంతులు

కంది మండల కేంద్రం ఊరి పక్కనే చెర్వు ఉంది. ఇటు జాతీయ రహదారి, అటు వైపున ఐఐటీ హైదరాబాద్ మధ్యన చెర్వు ఉంది. చెర్వు కింద వందల ఎకరాల ఆయకట్టు కూడా ఉంది. చెర్వు నీటి నిర్వహణను గాలికి వదిలేయడం వల్ల చెర్వులోకి నీరు వచ్చే నలాలు సైతం కబ్జాకు గురయ్యాయి. అలాగే చెర్వులోంచి దిగువకు నీళ్ల వెళ్లే కాల్వలు కూడా నిర్మాణాలతో కతం చేశారు. జాతీయ రహదారి వెంట ఊరి భాగంలో ఎప్పటి నుంచో చెర్వు శిఖం భూమిలో ఇళ్లు, హోటల్లు, ఇతర వ్యాపార సముదాయాల్ని నిర్మించారు. ఐఐటీహెచ్ పక్కన నుంచి భారీ ఎత్తున శిఖంలో వెంచర్లు చేశారు. చెర్వు నిండితే నీటి మట్టం ఐఐటీ ప్రహరీ గోడ వరకు చేరుకుంటది. పక్కనే రోడ్డు ఉండడంతో ఆ రోడ్డు కింది భాగంలో కొందరికి పట్టా భూములున్నాయి. అట్టి భూముల్లో చెర్వుల్లో నీళ్లులేని సమయంలో పంటలు సాగు చేసుకునే అవకాశముంది. కానీ..! కొందరు రైతుల నుంచి భూముల్ని చేతులు మార్చి కమర్షియల్ చేశారు. పట్టా పేరిట చెర్వులోని నీళ్లల్లోనే వెంచర్లు చేశారు. రోడ్డు వైపు ఓ పెద్ద కార్పొరేట్ స్కూల్, ఓ పరిశ్రమతో పాటు ఇళ్లు నిర్మించారు. చెర్వు మధ్యలోంచే మట్టిపోసి రోడ్డు వేశారు. ఆ రోడ్డును ఆదారంగా చేసుకుని వెంచర్లు చేశారు. నీళ్లల్లోనే కడీలు నాటి ప్లాట్లు అమ్మారు. కొనుగోలు చేసిన వ్యక్తులు నీళ్లల్లోనే ప్రహరీ నిర్మించడం, కడీలు నాటి సరిహద్దులు పాతుకున్నారు. ఓ గుడి కూడా నిర్మించారు. దాని పక్కనే మూడంతస్తుల భవనం సైతం నిర్మించారు. పక్కనే మరో వెంచర్ సైతం ఎఫ్‌టిఎల్ పరిధిలోనే ఉన్నది. పట్టా పేరిట శిఖం భూముల్లో చెర్వు నిండితే నీళ్ల రాకుండా మట్టిపోయడం, ఎత్తు చేసి నిర్మాణాలు కట్టేసి ఎఫ్‌టిఎల్ పరిధి కాదనే వాదన వినిపిస్తున్నారు. రోడ్డు వెంట పలు దాబాలు, హోటళ్లు, వ్యాపార సముదాయం కోసం భవనాలు నిర్మించారు.

మండలంలో పలు కుంటలు కతం

కంది మండల కేంద్రమే కాకుండా పలు గ్రామాల్లోని చెర్వుల్ని కూడా కాజేస్తున్న పరిస్థితి ఉంది. పాలక వర్గాల సిఫార్సులు, అధికారుల చోద్యం వల్ల విలువైన నీటి వనరులు కనుమరుగవుతున్నాయి. కంది మండలంలోని ఆరుట్ల కుంట శిఖంలో కొందరు వెంచరు చేశారు. పెద్దచెర్వు, రామసానికుంట, మల్లన్నగారికుంట, సిద్దమ్మకుంట, గంగవానికుంటల్లో పావొంతు భూములు కబ్జాల పాలయ్యాయి. జలకళతో ఉండాల్సిన కుంటలన్నీ వెంచర్లతో నిండిపోయాయి. ఆరుట్ల చెర్వు సర్వేనెంబర్ 159లో 112.20 ఎకరాల వరకు విస్తరించింది. ఇందులో 92.20 ఎకరాల వరకు పట్టా భూములున్నాయి. వీటిల్లో నీళ్లలేని సమయంలో పంటలు మాత్రమే సాగు చేయాల్సి ఉంది. అయితే చాలా మంది పట్టాల పేరిట విక్రయించడంతో చెర్వు శిఖం భూముల్లో వెంచర్లు, ప్లాట్లు చేసి అమ్మేసుకున్నారు. సిద్దమ్మకుంట సర్వే నెంబర్ 31లో 14.31 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో నాలుగు ఎకరాల వరకు కబ్జా పాలైంది. సర్వే నెంబర్ 48లో గంగవానికుంట 7.4 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులోనూ కొంత కబ్జా చేయబడింది. రాయనికుంట 16.15 ఎకారలకు గాను ఆరు ఎకరాల వరకు, మల్లన్నగారికుంట సర్వే నెంబర్ 467లో 17 ఎకరాల్లో మూడు ఎకరాల వరకు కబ్జా కోరల్లో చిక్కింది.

కంది చెర్వును పరిశీలించిన జేసీ, ఆర్డీఓ

సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఉన్న కంది చెర్వు ఇప్పటికే ఆక్రమణకు గురైంది. హైడ్రా పరిధి సంగారెడ్డి జిల్లాలోని అమీన్‌పూర్ వరకు విస్తరించి ఉంది. దీంతో పక్కనే ఉన్న కంది కబ్జాపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. జేసీ, ఆర్డీఓ కంది చెర్వు ఎఫ్‌టిఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాల్ని పరిశీలించారు. చెర్వుకు సంబంధించిన సమగ్ర వివరాల్ని ఇవ్వాల్సిందిగా ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల్ని ఆదేశించారు.

> జీహెచ్ఎంసీ పరిధికి కూతపెట్టు దూరంలో సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఉన్న కంది చెర్వు కబ్జాల పరమవుతోంది. ఎఫ్‌టీఎల్ పరిధిలో సైతం భారీ భవంతులు వెలిశాయి. చెర్వు శిఖంలో వెంచర్లు చేసి ప్లాట్లుగా అమ్మేశారు. చెర్వు నీళ్లల్లోనే కడీలు నాటి కబ్జాకు పాల్పడ్డారు. చెర్వు పూర్తిస్థాయిలో నిండితే నీరు చేరుకునే పరిధిలోనే కార్పొరేట్ స్కూల్, పరిశ్రమ, మూడంతస్తుల భవనాలు నిర్మించారు. చెర్వులోనే ప్రహరీ కట్టి నీళ్ల రాకుండా చేశారు. హైదరాబాద్-ముంబయి జాతీయ రహదారి వెంట సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఉన్న కంది మండల కేంద్రంలో పలు చెర్వు, కుంటలు కబ్జాల పాలవుతున్నాయి. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చోద్యం చూస్తూ వచ్చారు. అమీన్‌పూర్ వరకు ఉన్న హైడ్రాను సంగారెడ్డి వరకు విస్తరించాలనే డిమాండ్ ఉంది. భారీ ఎత్తున చెర్వులు కబ్జా పాలైనందున వాటిని సైతం కూల్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

హైడ్రాను సంగారెడ్డికి విస్తరించాలి: అతిమేల మాణిక్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు



చెర్వుల విస్తీర్ణం, ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్ పరిధి ఎంత వరకు ఉన్నదనే విషయాలపై అధికారులు సర్వే జరపాలి. ఒక్కో చెర్వు వారిటి వాటి వివరాల్ని బహిర్గతం చేయాలి. ఇప్పటికే పలు చెర్వుల్లో ఎఫ్‌టిఎల్ పరిధిలోనే వెంచర్లు వేసి ప్లాట్లు చేసి విక్రయించారు. వాటిని తొలగించాలి. అలాగే దాబాలు, హోటళ్లు, స్కూల్స్, పరిశ్రమలు, ఇళ్లు కట్టుకున్న వాటిని గుర్తించి చర్యలు తీసుకోవాలి. చెర్వు నీళ్లల్లో సైతం ప్రహరీ నిర్మించడం, మట్టిపోసి ఇళ్లు కట్టడం, కడీలు పాతి ప్లాట్లకు సరిహద్దులు నాటడం, రోడ్డు వేసి విద్యుత్ స్థంభాలు వేసుకోవడం వంటి జరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదు. వెంటనే ఎఫ్‌టిఎల్ పరిధిలోని కబ్జాలపై చర్యలు తీసుకోవాలి. అలాగే నాలాల్ని ఆక్రమించి నిర్మాణాలు చేయడం వల్లనే కంది చెర్వులోకి నీళ్ల రాకపోకలు బంద్ అయ్యాయి. దీంతో చెర్వంతా కలుషితంగా మారి ఊరి ప్రజలు నివాసముంటే పరిస్థితిలేదు. నాలాల్ని కూడా క్లియర్ చేయాలి.

చెర్వుల సర్వే చేస్తున్నం : బి.భీమ్, ఐబీ ఈఈ

హైడ్రా ఏర్పడిన నేపథ్యంలో జిల్లాలోని చెర్వుల విస్తీర్ణం, ఆయకట్టు, ప్రస్తుత పరిస్థితి, ఎఫ్‌టిఎల్ పరిధి, బఫర్ జోన్ వంటి వివరాల్ని రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని కోరింది. అందులో భాగంగా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమన్వయంలో చెర్వుల గురించి పూర్తి వివరాల్ని సేకరిస్తున్నాం. ప్రభుత్వం ఆదేశాల మేరకు చర్యలు తీసుకోబడతాయి. చెర్వు శిఖం, నాలాలు, కాల్వలు వీటిని ఆక్రమించడం, కబాజ చేసి నిర్మాణాలు చేయడం వంటి విషయాలపై రిపోర్టు తయారు చేస్తున్నాం.

సింగూరు నీటిని దిగువకు విడుదల చేసిన మంత్రి దామోదర్

- రాబోయే రోజుల్లో రైతులకు సాగుకు నీరు అందిస్తాం
- దిగువకు 20వేల క్యూసెక్కుల నీరు విడుదల
- మంత్రి దామోదర్ రాజనర్సింహ



నవతెలంగాణ- పుల్కల్
ఉమ్మడి మెదక్ జిల్లాలోనే అతిపెద్ద ప్రాజెక్టు అయినా సింగూరు ప్రాజెక్టులోకి గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు భారీగా వరద నీరు వచ్చి చేరడంతో ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ప్రాజెక్టు పూర్తి స్థామర్థ్యం 29.917 కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 28.666 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి ఇన్ఫ్లో 29, 784 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుంది. దీంతో ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ప్రాజెక్టుకు వరద ఉధృతి ఎక్కువ ఉండడంతో గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి ప్రాజెక్టు వద్ద గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రాజెక్టు నాలుగో నెంబర్, ఆరో నెంబర్ గల గేట్లను .1.50 మీటర్ల పైకి ఎత్తి సుమారు 20 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాబోయే యాసంగి పంటకు వ్యవసాయానికి ఎడమ కాలువ ద్వారా లక్ష ఎకరాలకు నీటిని విడుదల చేస్తామన్నారు. దీంతో రైతులు పచ్చని పంటలతో కళకళలాడాలని ఆయన అన్నారు. కావున ప్రాజెక్టు అధికారులు ఎప్పటికప్పుడు నీటి ప్రవాహాన్ని పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు .కాంగ్రెస్ పార్టీ పుల్కల్ మండల అధ్యక్షులు దుర్గారెడ్డి, చౌటాకుర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నత్తి దశరథ్, పార్టీ సీనియర్ నాయకులు రామ్ చంద్ర రెడ్డి, లక్ష్మారెడ్డి, బోయిని శ్రీనివాస్, గోవర్ధన్, ముద్దాయి పేట కమల్ రెడ్డి ఆయా మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించి ఉంటే ప్రాణ నష్టం తగ్గేది

- మాజీ మంత్రి హరీష్ రావు
- ఖమ్మం వరద బాధితులకు నిత్యావసర సరుకులు
- వాహనాలను జెండా ఊపి పంపించిన హరీష్ రావు



నవ తెలంగాణ-సిద్దిపేట
వర్షాల మూలంగా ప్రాణనష్టం జరిగిందని, ముందుగా ప్రభుత్వం మేలుకుంటే ప్రాణనష్టాన్ని తగ్గించే అవకాశం ఉండేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఖమ్మం వరద బాధితులకు సరకులు పంపే వాహనాలను సిద్దిపేటలోని క్యాంపు కార్యాలయం వద్ద గురువారం జెండా ఊపి ఆయన పంపించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ ఖమ్మం, మహబూబాబాద్‌లో వర్షానికి తీవ్ర నష్టం వాటిల్లిందని, సిద్దిపేట నుంచి ఉడుతాభక్తిగా సహాయం చేస్తున్నామన్నారు. మానవ సేవయే మాధవ సేవ అని, అందురూ ముందుకు వచ్చి వరద బాధితులకు సహాయం చేయాలని కోరారు. సహాయం చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందన్నారు. రాష్ట్రంలో ప్రజా పాలన కాదు రాక్షస పాలన నడుస్తుందన్నారు. బీఆర్ఎస్ ఎంఎల్ఏలు, ఎంపీలు, ఎంఎల్సిల నెల వేతనం వరద బాధితులకు అందిస్తున్నామని, బీజేపీ మిగతా పార్టీల నాయకులు సహాయం చేయడానికి ముందుకు రావాలని కోరారు. తాము వరద బాధితులకు సహాయం చేయడానికి ఖమ్మం వెళితే తమపై దాడి చేసి, కేసులు నమోదు చేస్తున్నారని, అక్కడి ప్రజలు ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారన్నారు. సీఎం తాటాకు చప్పుళ్లకు ఎవరు భయపడరన్నారు. తమకు వస్తున్న స్పందనను చూసి ఓర్వలేకనే దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు అన్నం, నీళ్ల ఇవ్వలేక పోయారని, ఇండ్లు నీళ్లలో మునిగి పోయిన వారికి రూ. 2 లక్షలు ఇచ్చి ఆదుకోవాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, అమర్నాథ్ అన్నదాన సేవా సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ముల్కనూరు రోడ్డు పనులు వేగవంతం చేయాలి

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి
సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి కే మల్లేశం



నవతెలంగాణ - హవెలిఘనపూర్
మెదక్ నుండి ముల్కనూరు వెళ్లే హైవే రోడ్డు పనులను వేగవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి కే మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు గురువారం మండల పరిధిలోని గంగాపూర్ గ్రామంలో సిపిఎం శాఖ మహాసభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా పనులు జరుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలలో వికలాంగులకు పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు.జిల్లాలో 14,000 మంది రేషన్ కార్డుల కోసం రేషన్ కార్డులో పేర్లు జత చేయడం కోసం దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 5000 పెన్షన్ వృద్ధులకు, వితంతువులకు, గీత కార్మికులకు, బీడీ కార్మికులకు పెన్షన్ దారులకు నాలుగు వేల రూపాయలు చెల్లించాలని తెలిపారు. అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 50,000 నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. చెరువులు,కుంటలు గండ్లను పూడ్చాలని డిమాండ్ చేశారు. మహాసభలో శాఖ కార్యదర్శి ఎన్నిక జరిగిందని అన్నారు నూతన కార్యదర్శిగా కె కొమురయ్య, ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి దేవయ్య, కే భీమేష్ ,కే వెంకటి ,ఎస్ వెంకట్ , తదితరులు పాల్గొన్నారు.

గీతమ్‌లో ఉత్సాహంగా ఉపాధ్యాయ దినోత్సవం



నవ తెలంగాణ-పటాన్ చెరు
భారతదేశ మాజీ రాష్ట్రపతి, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ (137వ జయంతిని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 'ఉపాధ్యాయ దినోత్సవాన్ని' ఘనంగా నిర్వహించారు. యువతను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కీలక పాత్రను, దేశ నిర్మాణానికి వారి అమూల్యమైన సహకారాన్ని గుర్తించడానికి ఈ ప్రత్యేక రోజు అంకితం చేయబడింది.ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆయా విద్యార్థులు వారి వారి అధ్యాపకుల నిరంతర కృషి, అంకితభావాలను గుర్తిస్తూ శుభాకాంక్షలు తెలియజేసి, వారి ఆశీర్వాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్. రావు సహా విశిష్ట ప్రముఖులు, ఉపాధ్యాయ వృత్తి ప్రాముఖ్యతను స్ఫూర్తిదాయక ప్రసంగాలు చేశారు. జ్ఞాన ప్రకాశానికి ప్రతీకగా, జ్యోతి ప్రజ్వలనతో ఈ వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. తమ విభిన్న ప్రతిభను ప్రదర్శించే పలు సాంస్కృతిక కార్యక్రమాలను విద్యార్థులు. నిర్వహించారు. సంప్రదాయ, పాశ్చాత్య నృత్యాలతో పాటు కచేరీలను ప్రదర్శించి, వాటిని తమ అధ్యాపకులకు అంకితం చేశారు. హృదయాలను హత్తుకునే ఒక వీడియోను కూడా ఈ సందర్భంగా ప్రదర్శించి, అందులో తను అధ్యాపకులకు హృదయపూర్వక కృతజ్ఞతలను తెలియజేశారు. అంతే కాకుండా, అధ్యాపకుల కోసం కొన్ని ప్రత్యేక క్రీడాపోటీలను కూడా నిర్వహించి, వారి ఉత్సాహాన్ని రెట్టింపు చేశారు. ప్రొఫెసర్ కె.మారుతీప్రసాద్‌కు ఉత్తమ ఉపాధ్యాయుడు, పద్మజలకు ఉత్తమ అధ్యాపకురాలు అవార్డులిచ్చి సత్కరించారు. ఉపాధ్యాయుల దినోత్సవాన్ని చిరస్మరణీయంగా మార్చడానికి సహకరించిన వారందరికీ విద్యార్థి సమన్వయకర్త కృతజ్ఞతలు తెలియజేశారు.

తొలగించిన గెస్ట్ లెక్చరర్స్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్



నవ తెలంగాణ-సంగారెడ్డి
గురుకులల్లో గెస్ట్ లెక్చరర్స్‌ను వెంటనే విధులకు తీసుకోవాలని వారిని తొలగించడం అన్యాయమని గురుకుల విద్యార్థుల చదువులకు నష్టం చేసే చర్యలు ప్రభుత్వం మానుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డిలో జరిగిన కెవిపిఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అతిమేల మానిక్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ గురుకులాల్లో గెస్ట్ లెక్చరర్స్ గా గత నాలుగైదు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తూ విద్యార్థులకు బోధన చేస్తున్నారు ప్రభుత్వం హఠాత్తుగా వారిని విధుల నుంచి తొలగిస్తే ఎట్లా..? అని ఆయన ప్రశ్నించారు? విద్యా సంవత్సరం మధ్యలో లెక్చరర్స్‌ను తొలగించడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు. తొలగించిన గెస్ట్ లెక్చరర్స్‌ను వెంటనే విధులకు తీసుకోవాలని, విద్యార్థులు సదువులు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ప్రభుత్వానికి హెచ్చరించారు.ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్, సుభాష్, జిల్లా కమిటీ సభ్యులు దత్తు, చంద్రశేఖర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

సీఐటీయూ ఖేడ్ డివిజన్ కన్వీనర్ నల్లవల్లి రమేష్



నవతెలంగాణ- కల్హేర్,
ఆశ వర్కర్లకు కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించి వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ నారాయణఖేడ్ డివిజన్ కన్వీనర్ నల్లవల్లి రమేష్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన కల్హేర్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ రెడ్డికి ఆశలతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా గ్రామాలలో వైద్య సేవలు అందిస్తున్న ఆశలను ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించి వారి ఉద్యోగాలు పర్మినెంట్ చేసి ఈఎస్ఐ ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఆశలకు ఆరు నెలలు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. లేదంటే ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సతీష్, ఆశ కార్యకర్తలు ,తదితరులు, పాల్గొన్నారు.

నవతెలంగాణ
ప్రజల తెలుగు దినపత్రిక
2
సంగారెడ్డి
శుక్రవారం | 06 సెప్టెంబర్ 2024 | www.navatelangana.com

గురువులు భవిష్యత్తు మార్గదర్శకులు



- నీలం మధు ముదిరాజ్

నవతెలంగాణ-పటాన్ చెరు: గురువులు విద్యార్థుల భవిష్యత్తు మార్గదర్శకులని మెదక్ పార్లమెంట్ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవంను పురస్కరించుకొని మండలంలోని చిట్కుల్ లోని ఎస్ఎంఆర్ క్యాంప్ కార్యాలయంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేందుకు గురువులు చేసే సహకారం వెలకట్టలేనిదన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో ఒక్కొక్క దశలో గురువులు మార్గదర్శకులుగా ఉంటారని తెలిపారు. బాల్యంలో తల్లిదండ్రులు, పాఠశాలలో టీచర్లు, ఉద్యోగ సమయంలో పై అధికారులు, రాజకీయంలో తమకు నచ్చిన మెచ్చిన నాయకులను గురువుగా భావిస్తారన్నారు. తమ శిష్యులు ప్రయోజకులై జీవితంలో స్థిరపడితే గురువులకు అంతకు మించిన సంతోషమేది ఉండదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు గురువుల మాట తూచా తప్పకుండా పాటిస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు, ఆ తర్వాత సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను నీలం మధు ముదిరాజ్ ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ సుంకరి రవీందర్, వి నారాయణ రెడ్డి, మాజీ సభ్యులు వెంకటేశ్,మురళీ,రాజ్ కుమార్,కృష్ణ, శ్రీను,అనిల్, తదితరులు పాల్గొన్నారు.

రెండు లక్షల రుణ మాఫీకి దరఖాస్తులు చేసుకోవాలి



- ఏడిఏ నూతన్ కుమార్.

నవతెలంగాణ-కంగ్టి

రెండు లక్షల రుణమాఫీ కానీ రైతులు వారి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని ఏడిఏ, మండల ప్రత్యేక అధికారి నూతన్ కుమార్ అన్నారు. బుధవారం తుర్క వడగామాలో వ్యవసాయ అధికారులతో కలిసి దరఖాస్తులు స్వీకరించి ఆయన మాట్లాడాతూ ప్రభుత్వం వ్యవసాయ రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేయగా అందులో రేషన్ కార్డు లేని రైతులకు మాఫీ కాకపోవడంతో రేషన్ కార్డు లేని రైతులని గుర్తించి ప్రభుత్వానికి నీవేదిక పంపుతున్నామన్నారు.అందుకే రైతులు మీ గ్రామాల వ్యవసాయ అధికారులను సంప్రదించి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఒ వెంకటేశం, ఏఈఒ షరీఫ్, పిఏసిఎస్ ఛైర్మెన్ మారుతిరెడ్డి, పంచాయతి కార్యదర్శి, దేవయ్య,పడాల సంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఝరాసంగం: ఝరాసంగం మండల కేంద్రంలోని విజ్ఞానజ్యోతి మోడల్ స్కూల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థినీ, విద్యార్థులు పాఠశాల కరస్పాండెంట్ నాగన్నకు, ఉపాధ్యాయులకు శాలువా పూల మాలతో ఘనంగా సత్కరించి మిఠాయిలు తినిపించారు. గురు శిష్యుల అనుబం ధాన్ని విద్యార్థులు ఎప్పుడు మర్చిపో కూడదని ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నాగన్న విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ శ్వేత, ఉపాధ్యాయులు జి మల్లయ్య, బి సాయికుమార్, బి శ్రావణి, బిఈశ్వర మ్మ, స్రవంతి, నాగజ్యోతి, రోజా, జిలక్ష్మి, విద్యార్థిని విద్యార్థులు పోషకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-రామచంద్రాపురం

ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో కార్పొరేటర్ పుష్ప ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలోని ప్రతి ఒక్కరి ఎదుగుదలలో ఉపాధ్యాయుల పాత్ర తప్పనిసరిగా ఉంటుందని కాబట్టి సమాజంలో వారిని ఎల్లప్పుడూ గౌరవించాలని ఈ సందర్భంగా కార్పొరేటర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాథోడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-హత్నూర



హత్నూర మండల పరిధిలోని నస్తీపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లోకానందే ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హత్నూర మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ వరిగుంతం కృష్ణ హాజరై మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్ప అధ్యాపకుడిగా తత్వవేదగా రాష్ట్రపతిగా దేశానికి విశేష సేవలందించిన బహుముఖ ప్రజ్ఞశాలి భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని కొనియాడారు. వారి జయంతి సందర్భంగా ఉపాధ్యాయులకు ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంబేద్కర్ సంఘం నాయకులు ప్రవీణ్, గోవు శ్రీకాంత్, శ్రీనివాస్, లక్ష్మణ్, నీరుడు శివాజీ, శంకర్, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సదాశివపేట



జీనియస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్రాంత మండల్ విద్యాధికారి అంజయ్య విచ్చేశారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటారన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు అందరు కూడా క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ప్రతి ఒక్కరూ జీవితంలో కనీసం ఒక్కసారైనా రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలను కాపాడవలసిందిగా సూచించినారు. ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా స్కూల్ యజమాన్యం ఉపాధ్యాయులందరినీ ఘనంగా సన్మానించడం జరిగింది .ఇట్టి కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ ముద్ద నాగనాథ్, వైస్ చైర్మన్ కూచి శ్రీనివాస్, సెక్రెటరీ పోల వెంకటేశం, కరస్పాండెంట్ రఘు వర్ధన్ రెడ్డి, డైరెక్టర్లు నీలకంఠం మరియు అమరేందర్ రెడ్డి, ప్రిన్సిపల్ శ్రీమతి ప్రణీత రెడ్డి ,స్కూల్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సంగారెడ్డి



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని ఇష్టా జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఇష్ట ఇన్స్టిట్యూషన్ డైరెక్టర్ కార్తీక్, డీన్ ప్రేమ్ కుమార్, కళాశాల డైరెక్టర్ వినోద్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ రవి కిరణ్ రెడ్డి, ప్రిన్సిపల్ అకాడెమిక్స్ ప్రభాకర్, వైస్ ప్రిన్సిపల్ ఇబ్రహీం, కళాశాల అధ్యాపకుల బృందం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవికిరణ్ రెడ్డి డాక్టర్ రాధాకృష్ణ జీవిత చరిత్రను వివరించారు. సమాజంలో గురువు, ప్రాధాన్యతను వివరిస్తూ విద్యార్థులకు గురువు పట్ల ఉండవలసిన నిబద్ధత , క్రమశిక్షణ గురించి వివరించడం జరిగింది, కళాశాల అధ్యాపకులు కూడా గురువు ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులకు మార్గదర్శనం చేశారు.



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ నియోజకవర్గంలోని ప్రైవేటు ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహించారు. పాఠశాలల్లో ఉదయమే విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయులుగా వేషాదరణ వేసి తరగతి గదుల్లో తరగతులు బోధించి తమకంటూ ప్రతిభను చాటుకున్నారు. జహీరాబాద్ పట్టణంలోని ఆచార్య పాఠశాల, వెంకటేశ్వర పాఠశాల ,మాణిక్ ప్రభు పాఠశాల, బసవేశ్వర పాఠశాల ,గాంధీ మెమోరియల్ స్కూల్ ,శాంతినికేతన్ స్కూల్, భవన్ స్కూల్, సంఘమిత్ర, మహేంద్ర అండ్ మహేంద్ర, శ్రీకృష్ణవేణి ఉన్నత పాఠశాలలో భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. పదో తరగతి విద్యార్థినీ విద్యార్థులు చాత్రోపాధ్యాయులుగా తరగతులలో వారి బాధ్యతను నిర్వర్తించి వారి అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమాలలో ఆయా పాఠశాలల నిర్వహకులు, ప్రిన్సిపల్, ప్రధానోపాధ్యాయులు దినేష్ , ఉప ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, గౌతమ్, శ్రీశైలం, దశరథ్ రెడ్డి, వెంకటయ్య, సరోజినీ ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-రామచంద్రాపురం

వెలిమెలలోని తెలంగాణ మోడల్ స్కూల్ లో గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నేడు ఉపాధ్యాయులుగా నియమిస్తూ స్వయం ప్రభుత్వ దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులకు వివిధ ఆటలు నిర్వహించి బహుమతులు అందజేసి జ్ఞాపికలతో ఉపాధ్యాయులను సత్కరించారు. ఉపాధ్యాయుల పట్ల గౌరవాన్ని ప్రతిబింబించేలా అద్భుతమైన సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. అంకితభావంతో కూడిన ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ మార్గదర్శకత్వంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహం, సంతోషాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థులు ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకున్న తీరుపై ప్రిన్సిపాల్ రాంప్రసాద్, ఉపాధ్యాయులంతా సంతోషం వ్యక్తం చేశారు.

హెచ్ఎంను సన్మానించిన విద్యార్థులు

నవతెలంగాణ-పుల్‌కల్



మండలంల ముదిమాణిక్ ఎంపీపీఎస్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పప్రధానోపాధ్యాయుడు చంద శ్రీధర్‌ను విద్యార్థులు సన్మానించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయు దినోత్సవ ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంచందర్, శ్వేతా, కుమారి, కవిత తదితరులు పాల్గొనాష్ణరు.

శిధిలావస్థలో ఉన్న బిల్డింగ్ కూల్చివేత



నవతెలంగాణ- ఐడిఎ బొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని లక్ష్మి నగర్ కాలనీలోని శిధిలావస్థలో ఉన్న బిల్డింగ్‌ను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు గురువారం కుల్చేశారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బిల్డింగ్ కూలి ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యల్లో భాగంగా శిధిలావస్థలో ఉన్న బిల్డింగ్‌ను కూల్చివేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలను తనిఖీ చేసిన మంత్రి, కలెక్టర్

- పలు రికార్డులను పరిశీలించిన మంత్రి
- విద్యార్థుల కోసం అదనపు బస్సును ఏర్పాటు చేస్తాం





నవతెలంగాణ-పుల్కల్

మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామ శివారులో ఉన్న ఆదర్శ పాఠశాలను గురువారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతిలు ఆదర్శ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు అంతేకాకుండా ఉపాధ్యాయులు విద్యార్థులకు ఎలాంటి విద్యను అందిస్తున్నారని విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులు తాము పాఠశాలకు ఇతర ప్రాంతాల నుంచి రావడానికి బస్సులు సరిగ్గా లేకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే మంత్రి స్పందించి త్వరలోనే విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు దీంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు అంతేకాకుండా విద్య బోధించడంలో ఉపాధ్యాయులు ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు అంతేకాకుండా విధుల పట్ల ఏ ఒక్క ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. పాఠశాల విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అటు చదువుతోపాటు క్రీడల్లో కూడా ముందంజలో ఉండాలన్నారు. ఉన్నత ఆదర్శ పాఠశాలను మండలంలోనే కాకుండా జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవం కావడంతో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు గురువు స్థానం ఎంతో గొప్పదని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కాంగ్రెస్ పార్టీ రెండు మండలాల అధ్యక్షులు దుర్గారెడ్డి, నత్తి దశరథ్, పార్టీ సీనియర్ నాయకులు రామ్ చంద్రారెడ్డి లక్ష్మారెడ్డి, గోవర్ధన్, బోయిని శ్రీనివాస్ ముద్దాయి పేట కమల్ రెడ్డి ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

విద్యార్థి చదువు బాధ్యతను నేనే తీసుకుంటా





నవతెలంగాణ-మునిపల్లి

ఏ ఉద్యోగమైనా వ్యాపారమైనా ఆ వ్యక్తికి బతుకుతెరువును చూపిస్తుంది, అతని కుటుంబాన్ని బతికిస్తుంది. కానీ కొన్ని వృత్తుల ఉద్యోగాల ప్రయోజనాలు కేవలం వ్యక్తి స్థాయిలో ఆగిపోదు, దేశ ప్రగతికి పునాదిరాళ్ళుగా నిలుస్తాయి, సమాజానికి దీప స్తంభాలుగా ఉంటాయి అలాంటి వాటిలో ప్రధానమైనది ఉపాధ్యాయ వృత్తి, విద్యార్థుల వ్యక్తిత్వాలు సామర్థ్యాలను సాన పెట్టి, భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే బోధనా ఉన్నతమైనది. ప్రజలు విద్యార్థులు నన్ను మంచి ఉపాధ్యాయులుగా గుర్తించుకుంటే అదే నాకు గొప్ప గౌరవం అన్నాడు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, భవిష్యత్తుకు ఆశాజ్యోతులైన చిన్నారులను తీర్చిదిద్దే గురువులను దైవ సమానులుగా పరిగణించే సంస్కృతి మనది. దానికి తగినట్లే తమ విద్యార్థులను సొంత పిల్లలుగా చూసుకునే ఉపాధ్యాయులు తన బోధనా పద్ధతులతో నవతరానికి మెరికలు దిద్దుతున్న ఉపాధ్యాయులు దేశవ్యాప్తంగా ఎందరో ఉన్నారు. అలాంటి స్ఫూర్తి దాతలలో... ఇటీవల అనారోగ్యంతో మరణించిన వ్యక్తి యొక్క కుటుంబానికి చెందిన విద్యార్థికి స్థానిక ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ బాసటగా నిలిచారు. విద్యార్థి చదువు మధ్యలోనే ఆగిపోకూడదనే ఉద్దేశంతో విద్యార్థి యొక్క చదువు బాధ్యతను తాను తీసుకుంటానని కుటుంబానికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గురుపూజ దినోత్సవం నాడు కుటుంబం వద్దకెళ్లి పరామర్శించి బాలికకు స్కూల్ బ్యాగ్ నోట్ పుస్తకాలు ఇతరత్ర రాత సామాగ్రి అందజేసి పాఠశాలకు క్రమం తప్పకుండా పంపించాలని విద్యార్థిని యొక్క చదువు బాధ్యతలు తానే చూస్తానని ఈ సందర్భంగా ఉపాధ్యా యుడు నీలి లక్ష్మణ్ హామీ ఇచ్చారు. ఉపాధ్యాయుడు లక్ష్మణ్ యొక్క ఔదార్యాన్ని స్థానిక గ్రామస్తులు అభినందించారు. డిస్ట్రిక్ లెవెల్ బెస్ట్ టీచర్ గా గుర్తింపు పొందిన మరో ఉపాధ్యాయుడు ఇంగ్లీష్ బోధకుడు ఫిరంగుల గోపాల్ తన పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందించారు. తన పాఠశాల నుండి పై చదువుల నిమిత్తం తన పాఠశాలను వదిలి వెళుతున్న పేద విద్యార్థులకు ప్రోత్సాహం కలిగిస్తూ తనే దగ్గరుండి హాస్టల్లో గురుకుల పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేశారు. ఆయన విద్యార్థుల పట్ల చూపె ఆప్యాయత ప్రేమను విద్యార్థుల తల్లిదండ్రులు స్థానికులు అభినందిస్తున్నారు.

డీజే సౌండ్ సిస్టం వినాయక మండపాల వద్ద ఏర్పాటు చేయకూడదు

- వినాయక మండపాల ఏర్పాటు వివరాలను పోలీస్ వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలి
- ప్రశాంతంగా నిమజ్జనం పూర్తి చేసుకోవాలి
- సీఐ సుధీర్ కుమార్, ఎస్సై మహేశ్వర్ రెడ్డి



నవతెలంగాణ-గుమ్మడిదల

డీజే సౌండ్ సిస్టం అనుమతి లేనందున మండలంలో వినాయక మండపాల వద్ద అలాంటివి ఏర్పాటు చేయకూడదని సీఐ సుధీర్ కుమార్, ఎస్సై మహేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం గుమ్మడిదల మండల కేంద్రం రైతు వేదికలో శాంతి కమిటీ సమావేశం ఎస్సై మహేశ్వర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ సుధీర్ కుమార్ మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్నటువంటి అన్ని గ్రామాల యువత వినాయక మండపాలు ఏర్పాటు చేసుకుంటున్నటువంటి వివరాలను పోలీసు వెబ్సైట్లో నమోదు చేసుకోవాలని నిబంధనలను అధిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక మండపాల నిర్వాహకులు నిమజ్జనం వరకు ఎలాంటి మద్యం సేవించకుండా నిమజ్జనం జరుపుకోవాలని సూచించారు. విద్యుత్ అధికారులకు మండప నిర్వహకులు సమాచారం ఇచ్చి సహకరించాలని ఏఈ రవీందర్ కోరారు. వినాయక మండపాల వద్ద ఎప్పుడూ ఒక వ్యక్తి ఉండాలని నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చూసుకోవలసిన బాధ్యత నిర్వాహకులదేన్నన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి, తహసిల్దార్ గంగాభవాని, ఎంపీఓ దయాకర్ రావు, ఏఎస్ఐ డిఎస్ రాజు, హెడ్ కానిస్టేబుల్స్ సుదర్శన్, సుధాకర్, హెూంగార్డ్ రాజు, మండల వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్ చారి, ప్రభాకర్, నారాయణ, పద్మ, సంగీత, మాజీ ప్రజా ప్రతినిధులు సిహెచ్ కుమార్ గౌడ్, మైనార్టీ యువ నాయకుడు మహమ్మద్ ఫయాజ్, మైత్రి ఫౌండేషన్ చైర్మన్ జిల్లా బిజెపి ఓబిసి కార్యదర్శి చెన్నం శెట్టి ఉదయ్ కుమార్, మాజీ మండల అధ్యక్షులు నర్సంపల్లి రాజిరెడ్డి, గోస్కొండ బాల్ రెడ్డి, నీనాగోస్వామి, ప్రవీణ్ రెడ్డి, బిక్షపతి రెడ్డి, మహమ్మద్ సాదిక్, మహమ్మద్ సల్మాన్ పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలి

- బొల్లారం సీఐ గంగాధర్



నవతెలంగాణ-ఐడిఎ బొల్లారం

శాంతియుత వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలని బొల్లారం సిఐ గంగాధర్ పిలుపునిచ్చారు. గురువారం బొల్లారం సిఐ గంగాధర్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్లో పీస్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ గంగాధర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ఉన్న హిందూ, ముస్లిం, క్రిస్టియన్ సోదరులు అందరూ కలిసి ఎలాంటి మత విబేధాలు రాకుండా వినాయక చవితి జరుపుకోవాలన్నారు. అలాగే డీజే, సౌండ్ బాక్స్‌లకు అనుమతి లేకుంటే వినాయక మంటపాల దగ్గర ఏర్పాటు చెయ్యొద్దన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నవరాత్రులను జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పరిధిలోని వినాయక కమిటీ సభ్యులు హాజరైయ్యారు.



నవతెలంగాణ-ఝరాసంగం: ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలని జహీరాబాద్ రూరల్ సీఐ హనుమంతు, స్థానిక ఎస్ఐ నరేష్ లు తెలిపారు. గురువారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆయా గ్రామాల వినాయక మండపాల కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుకు అడ్డంగా మండపాలను ఏర్పాటు చేయకూడదని, దాని వల్ల ప్రజలకు కొంత మేర ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయన్నారు. మండపాల నిర్వహణ పూర్తి బాధ్యత ఉత్సహ కమిటీ సభ్యులదేనన్నారు. డిజె సౌండ్‌ను ఏర్పాటు చేయకూడదన్నారు. విద్యుత్ సరఫరా కోసం సంబంధిత శాఖ అధికారులను సంప్రదించాలన్నారు. ప్రతి ఒక్కరూ పోలీస్ అధికారులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వినాయక మండపాల కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

సీఐటీయూ తోనే హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కారం

- జిల్లా ఉపాధ్యక్షులు బి నాగేశ్వరరావు



నవతెలంగాణ-గుమ్మడిదల

సిఐటియు తోనే హమాలీల సమస్యలు పరిష్కారం అవుతాయని జిల్లా ఉపాధ్యక్షులు బి నాగేశ్వరరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని బొంతపల్లి పారిశ్రామిక ప్రాంతంలో వీరభద్ర హమాలీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సీఐటీయూ జెండా ఆవిష్కరిచ్చారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ రావు మాట్లాడుతూ బొంతపల్లీ పారిశ్రామిక ప్రాంతంలో అనేక పరిశ్రమల్లో దాదాపు 300 మంది హమాలీ కార్మికులు లోడింగ్, అన్లోడింగ్ పనులు చేస్తూ జీవనోపాధి గడుపుతున్నారన్నారు. వీరికి పనుల గ్యారంటీ లేదని చాలీ చాలని వేతనాలతో జీవనం కొన సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ఉద్యోగ భద్రత లేదని హమాలీ కార్మికుల సంక్షేమం కోసం, కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. పరిశ్రమల్లో యాజమాన్యాలు హమాలీ కార్మికులకు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను తుంగలో తొక్కి 4 కోడ్ లుగా విభజించిందని కార్మికుల హక్కులను కాల రస్తుందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలని హెచ్చరించారు. యూనియన్లు పెట్టుకోకుండా కేంద్ర ప్రభుత్వం చట్టాలను తీసుకొస్తుందన్నారు. ఇప్పటికే 12 గంటల పనిని పరిశ్రమల్లో అమలు చేస్తున్నారని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని హమాలీ కార్మికుల తమ హక్కుల కోసం పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు భిక్షపతి రెడ్డి, హమాలీ కార్మిక సంఘం నాయకులు ఈశ్వర్, కొండల్, కృష్ణ, వీరేశ్, రాములు, వెంకటేష్, యాదయ్య త పాల్గొన్నారు.

ఎంతో గౌరవ ప్రదమైనది ఉపాధ్యాయ వృత్తి

: ఆర్టీసీ డిఎం జాకీర్ హుస్సేన్



నవతెలంగాణ-జహీరాబాద్

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవంతో కూడుకుందని ఆర్టీసీ డిఎం జాకీర్ హుస్సేన్ అన్నారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక డిపో నందు ప్రయాణించేందుకు వచ్చినటువంటి ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులకు పూలమాల శాలువతో సన్మానించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో ఒక పౌరుడు ఏం కావాలన్నా ఉపాధ్యాయుని పైనే ఆయన భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా మారిన గురుకుల పాఠశాల

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు



నవతెలంగాణ-ఝరాసంగం

ఝరాసంగం మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల బాలికల పాఠశాలలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పాఠశాల ఆవరణతో పాటు గేటు ముందు సైతం బురద మయంగా మారడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతోంది. ప్రతినెల ప్రభుత్వం భవన యజమానికి అద్దె చెల్లిస్తున్నప్పటికీ పాఠశాలలో విద్యార్థులు ఇలాంటి భారీ వర్షాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. అయినప్పటికీ అటు భవన యజమానులు గాని, అధికారులు గాని ఇలాంటి సమస్యలను పరిష్కరించలేకపోతున్నారని తెలుస్తోంది. పాఠశాలలోకి విద్యార్థులు ఉపయోగించే కనీస వాహనాలు సైతం పాఠశాలలోకి రావడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. జిల్లా అధికారులు స్పందించి పాఠశాలలోని కనీస అవసరాలతో పాటు, భవన యజమానులతో సంప్రదించి విద్యార్థులకు సమస్యలు తలెత్తకుండా చూడాలని స్థానికులు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, పంటలు

- వృధాగా పోతున్న నారింజ నీటిని అరికట్టాలి
- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చెర్మెన్ వై.నరోత్తం డిమాండ్..
- పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి
- వర్షపు నీటితో గుంతల రోడ్లతో ప్రయాణికుల నరకం



నవతెలంగాణ-జహీరాబాద్

నారింజ నీటిని కాపాడి ఆయకట్టు రైతులకు నిరందివ్వాలని మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం డిమాండ్ చేశారు. గురువారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురియడం నియజకవర్గంలో పర్యటించి రోడ్లు, పంటలను, నారింజను పరిశీలించడం జరిగిందన్నారు. భారీ వర్షాలు పడటం వల్ల నీరు వెళ్లే నాళాలను వాగులను కబ్జాచేయడం, కుదించడం వాటిని దారి మళ్లించడం వలన వర్షపు నీరు ముందుకు వెళ్లే దారి లేక రోడ్లపైకి, ఇండ్ల లోపలికి నీరు రావడం జరిగిందన్నారు. .దీనిపై గతంలోనే అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. కానీ అధికారులు సకాలంలో చర్యలు చేపట్టనందున ఈ ముప్పు వాటిలిందన్నారు. ఈ వర్షాలకు చేతికి వచ్చిన పంటలలు పెసర, మినుము, పత్తి, టమాటా ఇలా చేతికి వచ్చిన పంట అంత నీళ్ల పాలైందన్నారు. .వ్యవసాయ అధికారులు పర్యటించి పంటలను పరిశీలించి పంట నష్ట పోయిన రైతులకు పంట నష్ట పరిహారం చెల్లించే విదంగా చూడాలన్నారు. నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా తయారైందన్నారు. ఏ రోడ్లు చూసిన రోడ్లు దెబ్బ తిని గుంతలుగా ఏర్పడి వర్షపు నీరు నిలబడి నాళాలను తలపిస్తున్నాయన్నారు. అల్గోల్, అల్లానా, రోడ్లు ఇందుకు నిదర్శనం ఆరోడ్లన్నీ గుంతలు ఏర్పడి వాటిలో నీరు నిలబడటంతో వాహనదారులు ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. నారింజ ఈ వర్షాల వల్ల వరద తాకిడితో నిండుకుండాల కనిపిస్తుందన్నారు. ఒక గేటు కూడా ఎత్తడం జరిగిబందని మిగతా గేట్ల పైనుండి నీటి ప్రవాహం పోతున్నది గేట్ల పరిస్థితి చూస్తే సరిగ్గా లేవు ఆగేట్లను మార్చాల్సిన అవసరముందన్నారు. అదే విదంగా వృధాగా పోతున్న నీటిని అరికట్టాలన్నారు. క్రింది బాగంలో చెక్ డ్యాంల ఏర్పాటుకు ప్రతిపాదనలు పెట్టి వృధా నీటిని అరికట్టి చుట్టు ప్రక్కల భూగర్భజలాలు ఎరిగే విదంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నారింజ క్రింద ఉన్న 3000 ఎకరాల ఆయకట్టుకు నిరందించే విదంగా చర్యలు చేపట్టాలన్నారు. నారింజను ఆదునికరించి ఒక పర్యాటక కేంద్రంగా మార్చాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, నాయకులు జి.నర్సింలు, షాహీద్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

తోటి కార్మికుడి కుటుంబానికి కార్మికుల ఆర్థిక సహాయం

- గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ

నవతెలంగాణ-మనోహరాబాద్



గ్రామపంచాయతీ కార్మికుడు అనారోగ్య కారణంగా మృతి చెందడంతో ఆయన కుటుంబానికి తోటి కార్మికులు అండగా నిలిచి ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్టు గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ పేర్కొన్నారు. తూప్రాన్ మండలం ఇమామ్‌పూర్ గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ వర్కర్ చెట్లపల్లి మల్లమ్మ భర్త గత నెల తేదీ 24న ఆరోగ్యం బాగోలేక ఇంటి దగ్గరనే చనిపోయినాడు. వారి యొక్క ఆర్థిక పరిస్థితి గమనించిన మండల కేంద్రంలో ఉన్న గ్రామపంచాయతీ కార్మికులు ఆర్థిక సాయంగా రూ.5వేలు తూప్రాన్ మండల అధ్యక్షులు మహేష్ చెట్లపల్లి మల్లమ్మకు ఆర్థిక సాయం గురువారం అందజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు శేఖర్, బాలయ్య, స్వామి, సరిత తదితరులు పాల్గొన్నారు

సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

-మనోహరాబాద్ పీహెచ్సీ డాక్టర్ వికాస్

నవతెలంగాణ-మనోహరాబాద్



వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మనోహరాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వికాస్ సూచించారు. గురువారం మనోహరాబాద్ మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్‌ల వద్ద సీజనల్ ఫీవర్ క్యాంప్ ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు వైద్య సేవలను అందించి పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని దోమల నివారణ కోసం నీటి నిలువలు ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వప్న, ఎంపీఓ లక్ష్మీ నరసింహులు, గ్రామ కార్యదర్శి రూప గౌడ్, ఏఎన్ఎం వినోద తదితరులు పాల్గొన్నారు.

సీఎంని విమర్శించే స్థాయి బీఆర్ఎస్ నాయకులకు లేదు

-కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-నర్సాపూర్



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించే స్థాయి బీఆర్ఎస్ నాయకులకు లేదని కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ గుప్తా, మల్లేశం, హబీబ్ ఖాన్, శ్రీనివాస్ గౌడ్, ఆంజనేయులు గౌడ్, రిజ్వాన్‌లు అన్నారు. గురువారం వారు నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ సునీత రెడ్డి నర్సాపూర్ ఎమ్మెల్యేగా ఉండి నియోజకవర్గానికి ఒక్క రూపాయి కూడా తీసుకు రాలేదని అన్నారు. నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి మాత్రం నియోజకవర్గానికి వివిధ అభివృద్ధి పనులకు రూ.20 కోట్ల వరకు తెచ్చాడని అన్నారు. ఎమ్మెల్యే సునీత రెడ్డి పదవులు లేని వారిని స్టేజీల పై కూర్చున్న పెట్టి ఫోటో కాల్ పాటించడం లేదని అనడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శిస్తే బీఆర్ఎస్ నాయకుల్లారా ఖబర్దార్ అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాగర్, ఎద్దు మల్లేశం, అజ్మత్, కృష్ణ, కృష్ణ గౌడ్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ శాఖ అనుమతులు తప్పనిసరి

- ఏఈ సీహెచ్ స్వామిలి

నవతెలంగాణ-నార్సింగి



వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని వినాయకుల మండపాల నిర్వాహనకు విద్యుత్ శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని నార్సింగి సబ్ స్టేషన్ విద్యుత్ ఏఈ సీహెచ్ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. మండపం నిర్వాహకులు సంబంధిత లైనమన్ ని సంప్రదించి విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలని, తద్వారా విద్యుత్ ప్రమాదాలను నివారించాలని అన్నారు. మండపాల వద్ద తగిన భద్రతా చర్యలు తీసుకోవడంతో పాటు ఐఎస్ఐ నాణ్యత కలిగిన విద్యుత్ వైర్లు పరికరాలు మాత్రమే ఉపయోగించాలని పేర్కొన్నారు. గణేష్ ఉత్సవాలను సురక్షితంగా సంతోషంగా నిర్వహించుకోవాలని అన్నారు. ఏవైనా సమస్యలు ఎదురైతే సంబంధిత లైనమెన్ ని సంప్రదించాలని, స్వంతంగా మరమ్మతులకు పూనుకోకూడదని, ప్రమాదాల బారిన పడి ఇబ్బందుల పాలు కావద్దని విద్యుత్ శాఖ ఏఈ స్వామి అన్నారు.

అంగన్వాడీ స్కూల్‌కు టీవీ అందజేత

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని జెట్ చెరువు తండ గ్రామంలో అంగన్వాడీ స్కూల్లో పిల్లల భవిష్యత్తు కోసం అక్షరాలు నేర్చుకునే విధంగా ఏబీసీడీలు గాని వన్ టూ త్రీ లు గాని సులువుగా నేర్చుకుంటారని డాక్టర్ మోహన్ నాయక్‌కి తెలుపగా వెంటనే స్పందించి ఎల్ఈడి టీవీని అంగన్వాడీ స్కూల్‌కు ఇచ్చారనీ అంగన్వాడీ టీచర్ సునీత అన్నారు. గ్రామ ప్రజల తరపున ధన్యవాదాలు తెలుపుతున్ననన్నారు. అనంతరం మోహన్ నాయక్‌ను అంగన్వాడీ టీచర్ శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో రమావత్ రాజు, ధనరాజ్, అంగన్వాడీ టీచర్ సునీత, ఆయ రజిత, తదితరులు పాల్గొన్నారు

పీఆర్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏన్నిక ఏకగ్రీవం

నవతెలంగాణ-పాపన్న పేట



పాపన్న పేట మండల పీఆర్‌టీయూ అధ్యక్షులుగా పంతులు రాజు, ప్రధాన కార్యదర్శిగా దాసరి సురేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రాథమికోన్నత పాఠశాల ఎల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన పీఆర్‌టీయూ మండల శాఖ సర్వసభ్య సమావేశంలో వీరు ఎంపికయ్యారు. అసోసియేట్ అధ్యక్షులుగా సంతోష్ కుమార్, ఫసి యోద్దీన్, ఉపాధ్యక్షులుగా బాల అనపోతా రెడ్డి ,మహిళా ఉపాధ్యక్షులుగా సంపత్ కుమారి, మహిళా కార్యదర్శిగా శ్యామల, కార్యదర్శిగా నాగేశ్వర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల సాధనలో ఎప్పుడూ ముందుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సబ్బని శ్రీనివాస్, సుంకరి కృష్ణ, పత్రికా సంపాదకవర్గ సభ్యులు వెంకటరామిరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కృష్ణమూర్తి, అంజనా చారి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్



పెద్ద శంకరంపేటలోని ప్రభుత్వ ఉన్నత, జిల్లా పరిషత్ బాలికల బాలుర ఉన్నత పాఠశాలలతో పాటు సరస్వతి శిశు మందిర్ మండల పరిధిలోని ఆయా ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చేసిన సేవల గురించి ఉపాధ్యాయ దినోత్సవం విశిష్టత గురించి పలువురు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ నోడల్ అధికారి వెంకటేశం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కంది రాజేశ్వరరావు విజయ్ కుమార్ జగదీష్ వీరప్ప సీతారామారావు శిశు మందిర్ పాఠశాల అధ్యక్షులు దాదిగారి గంగాధర్, ప్రబంధకారిని క్రాంతిలాల్, జంగం రాఘవులు, బుగుడాల సాయిలు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

నవతెలంగాణ-మెదక్ టౌన్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయుని నుంచి రాష్ట్రపతిగా ఎదిగిన విధానాన్ని, ఆయన వ్యక్తిత్వాన్ని వివరించారు. అధ్యాపకులు అసిస్టెంట్ ప్రొఫెసర్లు గణపతి, నరేందర్‌లను అధ్యాపక వృత్తిలో విశేషమైన సేవ చేసినందుకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



నవతెలంగాణ-కొమురవెల్లి

సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని మండలంలోని మరిముస్త్యాల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు అధ్యక్షులు కోనేటి రవి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్ పర్సన్ సంగీత నవీన్, వీవో వందన ఉపాధ్యాయులు అంజయ్య, భూపతిరెడ్డి, విజయలక్ష్మి, ప్రమోదిని, చింతల కనకయ్య, లత కిష్టయ్య, ఉమాలను చైర్మన్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శన, స్కిట్లు, ఆటపాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. తదనంతరం ఉపాధ్యాయ బృందం చైర్మెన్, వివోలను సన్మానించి.. విద్యార్థులకు మిఠాయి పంపకంతో కార్యక్రమాన్ని ముగించారు.

సమాజ నిర్మాణానికి గురువులు మూలం

- ఉపాధ్యాయుడు ప్రతిరోజు నిత్య విద్యార్థి
- టీచర్ ఎమ్మెల్సీ కూర రాఘోత్తం రెడ్డి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్







నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

సమాజ నిర్మాణానికి గురువులు మూలమని, ఉపాధ్యాయుడు ప్రతిరోజు నిత్య విద్యార్థి అని ఉపాధ్యాయ ఎమ్మెల్యే ఎమ్మెల్సీ కూర రాఘోత్తం రెడ్డి అన్నారు. గురువారం మెదక్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదిన సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రాఘోత్తం రెడ్డి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని మనం ప్రతి ఏడాది ఉత్సవాలు చేయడం జరుగుతుందన్నారు. ఆయన జీవితం కూడా మనందరం కూడా ఒక ఆదర్శప్రాయాన్ని జీవితంతో ఒక వైస్ ప్రెసిడెంట్ స్థాయి వరకు కూడా ఆయన వెళ్లడం మన అందరికి కూడా ఆదర్శమని అన్నారు.

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మనందరిని ప్రేరణపరచిన, మనకు జీవన పాఠాలు నేర్పిన గురువులను స్మరించుకోవాలన్నారు.గురువు తన విద్యార్థుల జీవితాల్లో కాంతి చూపించే దీపం. వారి మార్గనిర్దేశం మన భవిష్యత్తును సాకారం చేసే శక్తిని ఇస్తుంది. ఉపాధ్యాయులు కేవలం పాఠాలు నేర్పించే వారు కాక, మంచి విలువలను, ఆలోచనలను, జీవితంలో విజయవంతం కావడానికి కావలసిన మార్గాలను కూడా నేర్పిస్తారన్నారు.

టీచర్ ఎమ్మెల్సీ మాట్లాడుతూ గురువు అంటే మార్గదర్శి, నిపుణుడు, ఉపాధ్యాయుడు అని భారతీయ సంప్రదాయంలో గురువు అందరికంటే కంటే ఎక్కువ. సాంప్రదాయకంగా, గురువు శిష్యుడికి, విద్యార్థికి గౌరవప్రదమైన వ్యక్తి. గురువు శిష్యునికి జీవిత విలువలను నేర్పించే బోధకుడు, సాహిత్య జ్ఞానంతో పాటు, తన అనుభవ జ్ఞానాన్ని పంచేవాడు, విద్యార్థి జీవితంలో ఒక ఆదర్శ వ్యక్తి, స్ఫూర్తిదాయకమైన వ్యక్తి అని కొనియాడారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా 50 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు మెమెంటో, శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా విద్య అధికారి రాధా కిషన్, మున్సిపల్ చైర్మెన్ చంద్రపాల్, మండల విద్యాధిరులు, నీలకంఠం ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

140 మంది రైతులు ఎస్‌బీఐ బ్యాంకు ముందు ధర్నా

- రైతులను పట్టించుకోని తూప్రాన్ ఎస్‌బీఐ బ్యాంక్ సిబ్బంది
- రైతులను బ్యాంకు చుట్టూ తిప్పుకుంటున్న అధికారులు

నవతెలంగాణ-తూప్రాన్



రాష్ట్రంలో రైతుల కోసం సకాలంలో పంట రుణాలను రైతులకు అందించి చేదోడు, వాదోడుగా నిలుద్దామనుకున్న ప్రభుత్వ నిర్ణయాన్ని తూప్రాన్ ఎస్‌బీఐ బ్యాంక్ అధికారులు తుంగలో తొక్కుతున్నారు. 140 మంది రైతులు గురువారం రోజున బ్యాంకు ముందు ధర్నాకు దిగారు. గత 15 రోజులుగా పంట రుణాల కోసం బ్యాంకు చుట్టూ తిరుగుతున్న పట్టించుకోని ఘటన మెదక్ జిల్లా తూప్రాన్‌లో చోటుచేసుకుంది. బ్యాంకులో సర్వర్ పని చేయడం లేదంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు బ్యాంక్ అధికారులు రైతులను బ్యాంకు చుట్టూ తిప్పుకుంటున్నారు. స్థానిక ఎస్‌బీఐ బ్యాంకు ముందు సుమారు 200 మంది రైతులు 15 రోజులుగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్న సర్వర్ పనిచేయడం లేదంటూ బ్యాంకు సిబ్బంది కనీసం బ్యాంకులోకి రానివ్వకుండా గేటుకు తాళం వేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో రైతులు బ్యాంకు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు.ఉదయం 6 గంటల నుంచి బ్యాంకు ముందు పడిగాపులు కాస్తున్న రైతులను కనీసం తమను బ్యాంకులో అనుమతించకుండా రోడ్డుపైనే ఎండలో ఉంచి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్థానిక అధికారులు, రాజకీయ నాయకులు స్పందించి తమ సమస్యకు పరిష్కారం చూపాలని రైతులు వేడుకుంటున్నారు.

ఆశా వర్కర్ల కు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలి

- అధికారుల వేధింపులు ఆపాలి

నవతెలంగాణ-మెదక్ టౌన్







ఆశ ఆలిండియా పిలుపులో భాగంగా మెదక్ కలెక్టరేట్ కార్యాలయం దగ్గర ఆశ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేసి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా వైద్యాధికారి శ్రీరామ్‌కి ఆశ వర్కర్ల డిమాండ్లతో కూడిన వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆశ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కే.నర్సమ్మ మాట్లాడుతూ ఆశ వర్కర్లు గత 20 ఏళ్లుగా పని చేస్తున్నప్పటికీ ప్రభుత్వము పారితోషకాల పేరుతో శ్రమ దోపిడీ చేస్తుందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి అనేక సేవలు అందిస్తున్న ఆశ కార్యకర్తలను ప్రభుత్వం చిన్న చూపు చూడడం అన్యాయం అన్నారు. ఆశా కార్యకర్తలు గ్రామాల్లో లేకపోతే పేద ప్రజలకు సక్రమంగా ఆరోగ్య సేవలు అందవని అన్నారు. ఆశా కార్యకర్తలు తమ ప్రాణానికి తెగించి సేవలు అందిస్తున్నప్పటికీ ఆరోగ్య భీమా, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యము, ఉద్యోగ భద్రత కల్పించడంలో విఫలమైందన్నారు. 1000 మంది జనాభా కు ఒకరు పని చేయాల్సింది పోయి రెండు, మూడు వేల జనాభాకు ఒకరే ఆశ కార్యకర్తలు విధులు నిర్వహిస్తుందని, పని భారం ఎక్కువ అవుతుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ పథకాన్ని అమలు చేసిన ఆశా వర్కర్ ద్వారానే సర్వేలు నిర్వహిస్తుందని అన్నారు. పారితోషకం లేని పనులను ఆశా కార్యకర్తలతో చేపిస్తూ ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. స్కూటమి, నెలకు 2 గర్భిణీ కేసులు కొత్తగా నమోదు చేయాలని వంటి వాటిని టార్గెట్ పూర్తి చేయాలని ఆశలకు మానసిక ఒత్తిడి చేస్తున్నారు. దీంతో చాలా మంది ఇబ్బందిలకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆశా కార్యకర్తలకు పారితోషకాలు కాకుండా ఫిక్స్ వేతనం నిర్ణయించి అమలు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.26వేలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం, ఉద్యోగ భద్రత ఇతర డిమాండ్స్ లను పరిష్కరించాలని, అధికారుల వేధింపులు ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ జిల్లా నాయకులు సబిత, చంద్రకళ, రాములమ్మ, పెంటమ్మ, దుర్గా, తదితరులు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

అలుగు పారిన తూప్రాన్ పెద్ద చెరువు

- గంగమ్మకు పూజలు చేసిన మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ పట్టణంలోని గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో తూప్రాన్ పెద్ద చెరువులోకి భారీగా వరద నీరు చేరడంతో గురువారం ఉదయం అలుగెల్లింది. అలుగు పారడంతో పట్టణ వాసులు సంతోషం వ్యక్తం చేస్తూ గురువారం ఉదయం మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ఆధ్వర్యంలో గంగమ్మకు హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు, మత్స్యశాఖ డైరెక్టర్ గడప దేవేందర్ ఆధ్వర్యంలో చెరువు ఆలుగు పారడంపై హర్షం వ్యక్తం చేసి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ చెరువు నిండడం వల్ల మత్స్యసంపద పెరగడమే కాకుండా ఏడాదికి రెండు పంటలు సమృద్ధిగా పండుతాయన్నారు. తూప్రాన్ ప్రజలకు ఎంతో ఆహ్లాదంగాకారంగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, తూప్రాన్ పట్టణ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తూప్రాన్ మండల ఆర్ఎంపీ పీఎంపీల అసోసియేషన్ అధ్యక్షులు మహ్మద్ అప్సర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

పండుగల సందర్భంగా శాంతి కమిటీ సమావేశం

- ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దీన్

నవతెలంగాణ-నార్సింగి



వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండుగలను భక్తి శ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని నార్సింగి ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దీన్ విజ్ఞప్తి చేశారు. గురువారం ఎస్ఐ స్థానిక రెడ్డి సంఘంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పలు మతాల పెద్దలు, యువజన సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వహణ కొరకు ముందస్తుగా పోలీసుల అనుమతులు తీసుకోవాలని అన్నారు. విద్యుత్ శాఖ అనుమతులు కూడా తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. వాహనాలు వెళ్లేందుకు స్థలం ఉంచాలని అన్నారు. డీజేలకు అనుమతులు లేవని, ఒక్క సౌండ్ బాక్స్‌కు మాత్రమే అనుమతి ఉందని, రాత్రి 10 గం ల నుంచి ఉదయం 6 వరకు మైక్ లు, బాక్స్ లు వినియోగించ వద్దని అన్నారు. అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు తప్పక చేపట్టాలని, ముఖ్యంగా ఇతరులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించిన వారి పై చట్ట పరమైన, కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండుగలను నిర్వహించేందుకు నిర్వాహకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని స్థానిక ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దీన్ విజ్ఞప్తి చేశారు.

స్త్రీ నిధి ద్వారా రుణాలను పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- ఏపీఎం పెంటా గౌడ్

నవతెలంగాణ-మనోహరాబాద్

స్త్రీ నిధి ద్వారా రుణాలను పొంది మహిళా సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఏపీఎం పెంట గౌడ్ సూచించారు. గురువారం స్త్రీనిధి ఋణ సహాయంతో పాడిపశువు కొనుగోలుకు సంబంధించి ఈ కింది అంశాలను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు. గ్రామసంఘానికి చెందిన స్వయం సహాయక సంఘంలోని, సభ్యులందరి సమక్షంలో చర్చించి స్త్రీనిధి సంస్థ వారు ప్రత్యేక పథకం ద్వారా ఇస్తున్న డైరీ(పాడిపశువు) రుణం తీసుకోవడానికి నిర్ణయించిన నిబంధనలు.. 1.పాడిపశువులను తప్పనిసరిగా ఇతర రాష్ట్రాలలో మాత్రమే కొనుగోలు చేయాలి.దీనికి సంబంధించి స్త్రీనిధి ఆప్ డౌన్‌లోడ్ చేయించి దానిలో నమోదు చేయాలి, 2.పాడిపశువు కొనుగోలు చేసిన వెంటనే, భీమా రవాణా చేయాలి. కొనుగోలు చేసిన దగ్గర ట్యాగ్ (చెవిపోగు) వేయని యెడల గ్రామానికి తీసుకోచ్చిన వెంబడే ట్యాగ్ (చెవిపోగు) వేయించి భీమా (ఇన్సూరెన్స్) కవరేజ్ చేయించాలి.3) స్త్రీనిధి ద్వారా మంజూరైన రూ.93,270 లలో భీమా, వాటధనం మినహ మిగిలిన రూ.85,200 లలో రూ.75 వేలు పాడిపశువు కొనుగోలుకు, మిగిలిన రూ.7,200 దాణాకోసం, రూ. 3,000 రవాణా ఖర్చు కోసం వినియోగించుకోవాలి. 4) 11శాతం రేటు వడ్డీతో 48 నెలలు (48 సమానవాయిదా సాంకేతికతలో) తిరిగి స్త్రీనిధికి చెల్లించాలి. 5) పాడిపశువు కొనుగోలు చేయలేని పక్షంలో లేక ఇతర రాష్ట్రాల్లో కొనుగోలు చేయకపోతే వడ్డీతో సహా ఒక వాయిదాలోనే మొత్తం 15 రోజులలో తిరిగి చెల్లించాలి. 6) ఈ నాలుగేళ్లల్లో పాడిపశువు ట్యాగ్ (చెవిపోగు) ఎప్పుడు ఊడిపోయిన అదే రోజు తిరిగి ట్యాగ్ (చెవిపోగు) వేహించలి. 7) ట్యాగ్ లేకుండా (చెవిపోగు) ప్రమాదవశాత్తు పాడిపశువు మరణించిన యెడల బీమా వర్తించదు అనే విషయం తెలుసుకోవాలి. 8) చూడి పశువును కొనుగోలు చేయవద్దు. పైన తెలిపిన అన్ని విషయాలు సభ్యులు అందరు తెలుసుకోవాలని ఏపీఎం పెంటా గౌడ్ సూచించారు.

యావపూర్‌లో భారీ వర్షాలతో కూలిన ఇల్లు

నవతెలంగాణ-తూప్రాన్



తూప్రాన్ మండలం యావపూర్ గ్రామంలో ఎర్రోళ్ల నర్సమ్మకు చెందిన పెంకుటిల్లు గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పూర్తిగా కూలిపోయింది. ఈ సందర్భంగా ఎర్రోళ్ల నర్సమ్మ మాట్లాడుతూ వర్షాల కారణంగా తనకున్న పెంకుటిల్లు కూలిపోవడంతో ప్రభుత్వాధికారులు ఆదుకోవాలని ఎర్రోళ్ల నర్సమ్మ కుమారులు ఎర్రోళ్ల స్వామి, ఎర్రవోల నవీన్ ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కూలిన ఇల్లును పంచాయతీ కార్యదర్శి అనిత పరిశీలించారు.

ప్లాస్టిక్ విగ్రహాలు వద్దు.. మట్టి విగ్రహాలు ముద్దు

నవతెలంగాణ-మనోహరాబాద్



పర్యావరణం పరిరక్షణ కోసం ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వాడొద్దంటూ మట్టి విగ్రహాలు ముద్దు అని వాటిని ఏర్పాటు చేసుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మనోహరాబాద్ నందు పాఠశాల ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు అందరూ మట్టి ప్రతిమలను తయారు చేశారు. వారు వాతావరణ కాలుష్యానికి అదేవిధంగా రంగులతో ఉన్న కెమికల్‌తో ఉన్న రంగుల వినాయకుడు వాడకుండా మట్టి వినాయకులను తయారు చేసి తనవంతుగా నీటికలుస్యం కాకుండా తమ వంతు పాత్రులు అవుతారని కోరుతున్నారు చెప్పండి . చిన్నతనం నుంచే పర్యావరణ కాలుష్యం, పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కలిగి ఉండాలని పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం మల్లేశం చిత్రలేఖన ఉపాధ్యాయుడు బ్రహ్మచారి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మండలంలో, మున్సిపాలిటీలో పరిధిలోని గణేష్ ఉత్సవాలలో పోలీసు నిబంధనలను గణేష్ మండపాల నిర్వహణ తప్పకుండా పాటించాలని తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి గురువారం రోజున అమర జ్యోతి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో వెల్లడించారు. డీజేలకు అనుమతి లేదని, డీజేలు ఉపయోగిస్తే గణేష్ మండపాల నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామన్నారు. గణేష్ ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో జరగడానికి గణేష్ ఉత్సవ శాంతియుత కమిటీ బాధ్యతలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మామిళ్ల జ్యోతి కృష్ణ మాట్లాడుతూ తూప్రాన్ పట్టణంలో ఉత్సాహాలు నిర్వహించుకునే విధంగా, గొడవలు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యువజన సంఘాల నాయకులు, యువకులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అందాల శ్రీనివాస్ మాట్లాడుతూ అధికారులు ఫోన్ చేసిన ప్రకారమే వినాయక ఉత్సవాలు నిర్వహించుకోవాలని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా, అధికారులకు సహకరిస్తామన్నారు.ఈ సమావేశంలో సిఐ రంగాకృష్ణ, మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ గడప దేవేందర్, ఎస్సై శివానంద్, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో శేషాద్రి, విద్యుత్ ఏఈ వరాలబాబు, కౌన్సిలర్లు , కాంగ్రెస్ నాయకులు, బీజేపీ నాయకులు బీఆర్ఎస్ నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.





నవతెలంగాణ-మనోహరాబాద్

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను కాకుండా మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి నిమజ్జన చేయాలని దాంతో పర్యావరణ పరిరక్షణ కాలుష్యాన్ని కాపాడాలని ఎమ్మెస్ అగర్వాల్ ఫౌండరీస్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డైరెక్టర్ అనురాగ్ అగర్వాల్ పేర్కొన్నారు. గురువారం మనోహరాబాద్ మండలంలోని కోనపల్లి రంగయ్యపల్లి చెట్ల గౌరారం గ్రామాలలో ఎమ్మెస్ అగర్వాల్ పరిశ్రమ ద్వారా మట్టి గణపతులను పంపిణీ చేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ చతుర్థి సందర్భంగా సీఎస్ఆర్ కార్యకలాపం ద్వారా పర్యావరణ పరిరక్షణ పట్ల తన నిబద్ధతను ఉక్కు తయారీ సంస్థ ఎంఎస్ అగర్వాల్ ఫౌండ్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ పునరుద్ఘాటించింది. పర్యావరణ అనుకూల పద్ధతులు, కమ్యూనిటీ ఎంగేజ్మెంట్ పట్ల అంకితభావాన్ని నొక్కి చెబుతూ మనోహరాబాద్ మండలంలోని చెట్లగౌరారం, రంగాయిపల్లి, కోనాయిపల్లి నివాసితులకు కంపెనీ మట్టి గణేష్ విగ్రహాలను పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. బయోడిగ్రేడబుల్, కనీస పర్యావరణ ప్రభావాన్ని కలిగి ఉండే మట్టి విగ్రహాలను ప్రోత్సహించడం ఎంఎస్ఏఎఫ్ లక్ష్యమన్నారు. అనంతరం నరసింహం, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ "సమాజం నుంచి వచ్చిన ఉత్సాహభరితమైన స్పందన పర్యావరణ సవాళ్లను పరిష్కరించడానికి అవసరమైన సమిష్టి కృషిని వెల్లడిస్తుందని. గణేష్ చతుర్థి సందర్భంగా పర్యావరణ అనుకూల పద్ధతులకు ఇంత బలమైన మద్దతు లభించడం చూసి సంతోషిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చెట్ల గౌరారం మాజీ సర్పంచ్ నరసయ్య, ఉప సర్పంచ్ శ్రీహరి గౌడ్, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

సస్య రక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులు చేపట్టాలి



నవతెలంగాణ-మద్దూరు

మొక్కజొన్న పంటలో సస్యరక్షణ చర్యలతో పాటు యాజమాన్య పద్ధతులు చేపట్టాలని మద్దూరు ఏవో రామకృష్ణ కోరారు. మండలంలోని ధర్మారం గ్రామంలో చెవిటి కర్ణాకర్, మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న పంటకు పై పాటు ఎకరానికి 20 కిలోల యూరియా 15 కిలోల పొటాషియం వేసుకోవాలని ఆయన తెలిపారు. బ్యాక్టీరియా కాండం కుళ్ళు తెగులు ఆశించే అవకాశం ఎక్కువ ఉన్నట్లయితే దాని నివారణకు బ్లీచింగ్ పౌడర్‌ను ఐదు కిలోలు వేసుకోవాలని ఆయన తెలిపారు. కత్తెరపురుగును కూడా గమనించినట్లయితే దాని నివారణకు 0.3 క్లోరాంత్రినిపోల్ మిల్లీలీటర్ల మందును లీటర్ని కలిపి పిచికారి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అఖిల్, రైతులు తదితరులు పాల్గొన్నారు

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు





నవతెలంగాణ-మర్కుక్

సిద్దిపేట జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా మర్కుక్ మండలం నుంచి ఇద్దరూ ఉపాధ్యాయులు ఎంపిక య్యారు. మండలంలోని మర్కుక్ జిల్లా పరి షత్తు ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులగా పనిచేస్తున్న ఎం.సిద్ధయ్య , ప్రాథమికోన్నత పాఠశాల ఎర్రవల్లిలో గణితం ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఎ.కనకరావుకు, ఎంపికైన విషయం తెలిసిందే. గురువారం టిటిసి భవనములో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు, డీఈవో శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేశారు. అనంతరం వారిని సన్మానించి, ప్రసంశ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మర్కుక్ మండల అద్యక్ష,కార్యదర్శులు రామకృష్ణ రెడ్డి, కుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, వెంకటేశం,పి.శ్రీను, తదితరులున్నారు.

హుస్సేన్ వుడెన్ ఫర్నిచర్ షాప్‌ను ప్రారంభించిన చైర్మన్



నవ తెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సెంట్ జోసఫ్ స్కూల్ ఎదురుగా హుస్సేన్ వుడెన్ ఫర్నిచర్ షాప్‌ను షాప్ యజమాన్యం సల్మాన్‌తో కలిసి మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న. రాజమౌళి గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ ప్రాంతం దినదినాభివృద్ధి చెందుతుందని వ్యాపారానికి అనుకూలమైన ప్రాంతం గజ్వేల్ అని, యువత స్వయం ఉపాధి మార్గాలని అన్వేషించి వ్యాపారంలో రాణించాలన్నారు. వినియోగ దారుల మన్నన పొందే విధంగా నాణ్యమైన ఫర్నిచర్‌ను విక్రయించాలన్నారు . ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ ఉప్పల మెట్టయ్య, గజ్వేల్ మజీద్ కమిటీ అధ్యక్షులు సయ్యద్ మతిన్, నాయకులు, రమేష్, కనుక గౌడ్, సూరజ్, మిత్రులు ఇజాన్, సమీర్, శైబాస్, సోహైల్, సమీర్, అఫ్రోజ్, మనోజ్, అలీ, కైఫ్ తదితరులు ఉన్నారు.

రైతు సంక్షేమానికి కృషి

- మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి



నవ తెలంగాణ-గజ్వేల్

రైతు సంక్షేమానికి కాంగ్రెస్ కృషి చేస్తుందని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్లో మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని గజ్వేల్ డివిజన్ వ్యవసాయ అధికారులు బాబు నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కోట్లాది రూపాయలు కేటయించి రైతు రుణమాఫీకి కృషి చేసిందని వారు గుర్తు చేశారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా రైతు సంక్షేమానికి కృషి చేయలేదని వారు పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో గజ్వేల్ నియోజకవర్గం సంబంధించిన పనులను శరవేగంగా పూర్తి చేస్తామని వారు పేర్కొన్నారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నాయకత్వంలో ముందుకు వెళ్తామని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గజ్వేల్ అభివృద్ధి జరిగిందని రైతు సంక్షేమం జరిగిందని వారు చెప్పారు. స్థానిక వ్యవసాయ అధికారులకు అనుసంధానంగా మార్కెట్ కమిటీ పని చేస్తుందన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలు పాటిస్తూ రైతులకు పంట మార్పిడి ఇతర విషయాల్లో గ్రామాల్లో మార్కెట్ కమిటీ పాలకవర్గం కూడా రైతులకు అందుబాటులో ఉండి అవగాహన కల్పిస్తుందని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు నాగరాజు, శైలజ పాల్గొన్నారు.

శిథిలావస్థలోని ఇంటిని కూల్చిన మున్సిపల్ చైర్మెన్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 20వ వార్డులో శిథిలావస్థలో ఉన్న ఇంటిని గురువారం మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత, కమిషనర్ మల్లికార్జున్ జేసీబీ సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో నివాస ఉన్న వారిని పునరావాస కేంద్రానికి తరలించి శిథిలమైన ఇళ్లను తొలగించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలందరూ సహకరించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వాల సుప్రజా నవీన్ రావు, నాయకులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అధిక వర్షాలకు పంట పొలాల్లో తగిన చర్యలు పాటించాలి




నవతెలంగాణ-మర్కుక్

ఇటీవల కురిసిన అధిక వర్షాలకు పంట పొలాల్లో తగిన చర్యలు చేపట్టాలని మర్కుక్ మండల వ్యవసాయాధికారి డా.టి.నాగేందర్ రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని ఇప్పలగూడెం, చేబర్తి, తదితర గ్రామాల్లో అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న పత్తి పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా నీరు నిలువ వుండే పొలాల్లో అత్యంత వేగంగా పెరిగే ఈ పారా విల్ట్ అనేది ఒక భౌతికమైన రుగ్మత, ఆకులు ఎండిపోవడం, రంగు మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ తెగులు విస్తరించటం వలన ఆకులు రాలిపోవడం నుంచి ఎరుపు రంగులోకి మారతాయన్నారు. పారావిల్ట్ ను ' సడెన్ విల్ట్ ' అని కూడా పిలుస్తారని. ఇది పొలంలో అప్పుడప్పుడు కొన్నిప్రాంతాల్లో కనిపిస్తుందన్నారు. ఒకే నమూనాలో పొలంలో కనిపించదని, దీని లక్షణాలను ఇతర తెగుళ్ల లక్షణాలకు పోలిక ఉండడం వలన అయోమయానికి గురి చేస్తుందన్నారు. ఎండిపోవడం, రంగు మారిపోవడం జరుగుతుందన్నారు. ఆకులు రంగు కోల్పోవడం నుంచి కాంస్య లేదా ఎర్రని రంగులోకి మారతాయని, తరువాత కణజాలం నిర్జీవమవుతుందన్నారు. అధిక మొత్తంలో పత్తి కాయలు వున్న మొక్కల్లో ఈ రుగ్మత అధికంగా ప్రభావం చూపిస్తుందన్నారు. కాయలు ఆకులు ముందుగానే రాలిపోవడం, కాయలు విచ్చుకుపోవడం జరుగుతుందన్నారు. మొక్క కోలుకోవచ్చు కానీ దిగుబడి మాత్రం తగ్గుతుందని తెలిపారు. పొలంలో నీరు నిలువ ఉండకుండా సరైన మురుగు నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రజినీకాంత్, విష్ణు వర్ధన్, రైతులు, తదితరులున్నారు.

బట్ట ఫ్లెక్సీలను వాడుదాం పర్యావరణాన్ని కాపాడుదాం

- మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్



నవతెలంగాణ-సిద్దిపేట

బట్ట ఫ్లెక్సీలనే వాడుదాం పర్యావరణాన్ని కాపాడుదామని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని ఫ్లెక్సీ ప్రింటింగ్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు పలు ప్రచారాలు, శుభాకాంక్షలు తెలిపే వాటికి ఇకపై నుంచి ఫ్లెక్సీ ప్రింటింగ్ చేయుటకు తప్పనిసరిగా బట్ట ఫ్లెక్సీలను మాత్రమే వాడాలనీ కోరారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీల కారణంగా పర్యావరణానికి హాని కలుగుతుందని, బట్ట ఫ్లెక్సీలను మాత్రమే వాడాలని తెలిపారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీలను ముద్రించినట్లయితే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. వెంటనే ప్రింటింగ్ యజమానులకు నోటీసులు సైతం జారీ చేయాలని టీపీఓ దేవరాజును ఆదేశించారు.

కల్వర్టుపై ఉన్న వర్షపు నీళ్ల కింద గుంతలు

- పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని అధికారులు







నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు, ముస్త్యాల గ్రామాల మధ్య ఉన్న చిన్నవాగు పై నిర్మించిన కల్వర్టుపై వర్షపు నీళ్లు నిలవడంతో నీళ్ల కింద ఉన్న గుంతలు ఏర్పడక వాహనదారులు ప్రమాదం బారిన పడుతున్న అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాగుపై కల్వర్టు పూర్తిగా గుంతల మయం కావడంతో వర్షాకాలంలో వర్షం నీరు గుంతల్లో నిలవడంతో ఇతర గ్రామాల నుంచి వచ్చే వాహనదారులు ఆ గుంతలు కనబడక ప్రమాదాలకు గురయ్యారని గ్రామస్తులు తెలిపారు. కల్వర్టుపై ఏర్పడ్డ గుంతలకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు ఎన్నోసార్లు అధికారులకు మొరపెట్టుకున్న ఎవరు పట్టించుకున్న పాపాన పోలేదు. గత కొద్ది రోజుల క్రితం ఒక ద్విచక్ర వాహన పై వెళ్తున్న కుటుంబం కల్వర్టుపై గుంతలు కనబడకపోవడంతో కల్వర్టుపై పడడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో ఒక చిన్న పిల్లవాడికి తలకు తీవ్ర గాయాలు అయ్యాయని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి చిన్నవాగు కల్వర్టుపై ఏర్పడ్డ గుంతలకు మరమ్మతులు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

సిబ్బంది కొరత..ఖాతాదారుల ఇబ్బందులు

- మండల కేంద్రంలో యూనియన్ బ్యాంక్‌పై విమర్శలు
- ఖాతాదారులను విస్మరించి దళారులకు అజ్యమిస్తున్నారని ఆరోపణలు



అధికారులను విజ్ఞప్తి చేశారు.

నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలో మొట్టమొదట ఏర్పడిన బ్యాంక్ ఆంధ్రా బ్యాంక్. కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఆంధ్రా బ్యాంక్..యూనియన్ బ్యాంకుగా మార్పు చెందింది. ఈ బ్యాంకులో సుమారు 10 వేల మంది ఖాతాదారులుంటారని సమాచారం. ఖాతాదారుల కనుగణంగా సేవలందించడంలో బ్యాంక్ ఉద్యోగులు విఫలమవుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. బ్యాంక్ ఉద్యోగులు సైతం నిబద్దతతో సేవలందించకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని ఖాతా దారులు వాపోతున్నారు. బ్యాంక్ ఉద్యోగులు విస్మరించడం వల్లే మధ్య దళారులను ఆశ్రయిం చాల్సిన దుస్థితి నెలకొందని ఖాతాదారులు అసహనం వ్యక్తం చేశారు. ఎన్నో ఎళ్లుగా ఖాతాదారులుగా ఉంటున్న ప్రజలను విస్మరించి ఒకరిద్దరు దళారులకు బ్యాంక్ ఉద్యోగులు అజ్యామిస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా బ్యాంక్ ఉద్యోగులు దళారులకు ప్రాధాన్యత ఇవ్వండా నిబంధనల ప్రకారం ఖాతాదారులకు సేవలందించి బ్యాంక్ మనుగడను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని పలువురు సూచిస్తున్నారు.

బాష సమస్యతో ఖాతాదారుల అవస్థలు

బ్యాంక్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఉద్యోగి ఇతర రాష్ట్రానికి చెందడంతో ఖాతాదారులు బాష సమస్యతో అవస్థలు పడుతున్నారు.దీంతో మేనేజర్ మాట్లాడే బాషకు అనుగుణంగా వ్యవహరిం చే మధ్య దళారులదే హవా సాగుతోందని విమర్శలు తలెత్తున్నాయి. ఇప్పటికైనా మధ్య దళారులకు అవకాశం లేకుండా ఉద్యోగులను కేటాయించాలని ఖాతాదారులు సంబంధిత బ్యాంక్‌పై అధికారులను విజ్ఞప్తి చేశారు.



బ్యాంకుల్లో దళారుల తిష్ట

రాపుల రాజు,బీఆర్ఎస్ నాయకుడు,చీలాపూర్

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో బ్యాంక్ ఉద్యోగులు ఖాతాదా రులకు నిబద్ధతో సేవలందించారు. కాంగ్రెస్ ప్రభుత్వ చేపట్టిన రుణమాఫీతో మద్య దళారులు బ్యాంకుల్లో తిష్ట వేస్తున్నారు. బ్యాంక్ ఉద్యోగుల తీరు మద్య దళారులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చుతుంది. ఇప్పటికైనా ఖాతాదారులకు ప్రయోజనం చేకూర్చేల బ్యాంక్ ఉద్యోగులు వ్యవహరిస్తే బాగుంటుంది.

క్షేమంగా ఉన్న సంక్షేమ హస్టల్స్‌ను సంక్షోభంలో పడేయకండి

- మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు
- వసతి గృహాల సలహా సంఘం సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు



నవ తెలంగాణ-సిద్దిపేట

క్షేమంగా ఉన్న సంక్షేమ హస్టల్లో సంక్షోభంలో పడేయవద్దని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. వసతి గృహ విద్యార్థులను మన కన్న పిల్లలుగా చూసుకోవాలని, ప్రభుత్వం దృష్టికి హాస్టల్ సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం జరిగిన వసతి గృహాల సలహా సంఘం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్దిపేట నియోజకవర్గ స్థాయి ఎస్సి, ఎస్టీ, బిసి పాఠశాలల అనుబంధ హస్టల్స్, కళాశాలల అనుబంధ హాస్టల్స్ పని తీరు పై హాస్టల్స్ వారీగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టళ్లలో ఉండే విద్యార్థులు పేద విద్యార్థులని, వారిని మన కన్న పిల్లలుగా చూసుకోవాలన్నారు. గత ప్రభుత్వం లో సంక్షేమ హస్టల్స్ అంటే నమ్మకం ఉండే కానీ, ఈ ప్రభుత్వం లో సంక్షోభ హాస్టల్స్ గా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 6 నెలల నుంచి డైట్, కాస్మోటిక్ ఛార్జ్ లు రాకపోవడం పట్ల ప్రభుత్వంపై మండిపడ్డారు. హాస్టళ్లలో పని చేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 7 నెలలుగా జీతాలు పెండింగ్ ఉన్నాయని, తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కళాశాల హాస్టల్స్ విద్యార్థులకు వచ్చే ప్యాకెట్ మని రూ.500 ఈ విద్యాసంవత్సరం మొత్తానికి రాలేదన్నారు. తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. స్కావెంజర్ నియమాకం లేక హాస్టళ్లలో అపరిశుభ్రత తలెత్తకుండా, వెంటనే స్కావెంజర్స్‌ను నియమించాలని కోరారు. హాస్టళ్లలో సమస్యలు, మౌలిక సదుపాయాలపై ప్రతి పాదనలు ప్రభుత్వానికి పంపాలని సూచించారు. నియోజకవర్గంలో అన్ని హాస్టల్స్ విద్యాధికారులు, ఎమ్మార్వోలు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అద్దె భవనాలు ఉండే హాస్టల్స్ లలో అద్దె కట్టక నెలలు గడుస్తున్నాయని, నా వంతుగా ప్రభుత్వం ద్రుష్టి కి తీసుకెళ్తాని, కొన్ని హాస్టల్స్ లలో మరమ్మతులు చేపట్టెందుకు జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇవ్వాలని కోరారు. అందరి సమన్వయంతో హాస్టల్స్‌ను కాపాడేందుకు, విద్యార్థులకి ఇబ్బందులు రాకుండా కృషి చేద్దామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, మండల విద్యాధికారులు, ఎమ్మార్వో లు, సంక్షేమ శాఖ అధికారులు, వార్డెన్ లు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో పంటలను సందర్శించిన వ్యవసాయ అధికారి



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండలంలోని ఆలిరాజుపేట గ్రామంలో పత్తి పొలాలను మండల వ్యవసాయ అధికారి వసంతరావు గురువారం సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుత అధిక వర్షాలకు పత్తి పంటలో పారా విల్ట్ లేదా సడెన్ విల్ట్ అధికంగా ఉండటం గమనించటం జరిగిందని ఇది పొలంలో చెదురుమదురుగా కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తుందని దీని లక్షణాలు ఇతర తెగుళ్ల లక్షణాలకు పోలిక ఉండటం వల్ల అయోమయానికి గురిచేస్తుంన్నారు. ఎండిపోవడం, రంగు మారిపోవడం దీని ముఖ్య లక్షణాలు అని తెలిపారు. వేగంగా పెరిగే మొక్కలు,అధికంగా పై ఆకులు, అధిక మొత్తంలో పత్తి కాయలు ఉన్న మొక్కలలో ఈ రుగ్మత అధిక ప్రభావం చూపిస్తుంది తెలిపారు. కాయలు మరియు ఆకులు రాలిపోవడం కాయలు విచ్చుకోకపోవడం కూడా జరగవచ్చన్నారు. దీని నివారణకు పొలంలో ఉన్న అధిక నీటిని మురుగు కాలువల ద్వారా బయటికి పంపించి సాధ్యమైనంత వరకు వేర్లకు గాలి తగిలేటట్లు చేయాన్నారు. తరువాత ఒక లీటర్ నీటికి 5 గ్రాముల 19-19-19 గానీ లేదా 13-0-45 కానీ మరియు 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ కలిపి ద్రావణాన్ని తయారుచేసి మొక్కల వేర్లు తడిచేటట్లు పోసుకోవాలన్నారు. వర్షాలు తగ్గి ఎండలు వచ్చినట్లయితే మొక్కలు త్వరగా కోలుకుంటాయని తెలిపారు.

మట్టి గణపతులను ఏర్పాటు చేసుకోవాలి





నవతెలంగాణ- గజ్వేల్

మట్టి గణపతులతోనే కాల్షియం నివారణ జరుగుతుందని మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్ అన్నారు. గురువారం శాలివాహన సంఘం వారు మట్టి విగ్రహాలను ఆయనకు అందించిన సందర్భంగా పై విధంగా అన్నారు. మట్టి గణపతులు ఎంతో ఉపయోగంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. తయారీ విగ్రహాల వల్ల కాలుష్యం వెదగలుగుతుందని మట్టి విగ్రహాలతో ఎలాంటి కాలుష్యం ఉండదన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించాలని ఆయన కోరారు. తొమ్మిది రోజులపాటు నవరాత్రులు ఘనంగా నిర్వహించుకోవాలని ఆయన కోరారు. శాలివాహనులు ఎంతో కష్టపడి మట్టి విగ్రహం తయారు చేస్తున్నారని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ప్రజలు మట్టి విగ్రహాలను కొనుగోలు చేసి వినాయక చవితి నిర్వహించుకోవాలన్నారు. మట్టి విగ్రహాలు కొనుగోలు చేస్తే శాలివానులకు ఉపాధి కల్పించే విధంగా ఉంటుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాడి పల్లి అనూఎఫ్ ఆ సంఘం నాయకులు మల్లేశం, నర్సింలు, పోచయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్. సి.రాజమౌళి అన్నారు. మున్సిపల్ ఆఫీస్‌లో చైర్మన్ ఎన్. సి.రాజమౌళికి గజ్వేల్ మండల కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని మట్టి గణపతి విగ్రహాలు పూజించడం ద్వారా పర్యావరణంకు మేలు కలుగుతుందన్నారు. అలాగే వినాయక మండపాల వద్ద నవరాత్రి ఉత్సవాలు ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో నిర్వహించాలన్నారు.ప్రజలు సుఖ సంతోషాలతో నిర్వహించుకోవాలని ఎక్కడ ఎలాంటి ఆటంకం కలగాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కుమ్మర సంఘం ప్రధాన కార్యదర్శి నాగపురి రమేష్, గజ్వేల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కొలిచెలిమె స్వామి, గజ్వేల్ మండల అధ్యక్షులు నాగపురి బాబు, మండల ప్రధాన కార్యదర్శి తోప్పల యాదగిరి, మండల ఉపాధ్యక్షులు కొలిచెలిమె మల్లేశం, కొలిచెలిమె పోచయ్య, సేగ్గారి కొండల్, కానుగుల రమణాకర్, కుమ్మరి కిషోర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బుడగ జంగాల కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ




నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండలం అక్కెన పల్లి మదిర గ్రామంలో 35 బుడగ జంగాల కుటుంబాలకు బుధవారం రాత్రి నిత్యావసర సరుకులను పంపిణీ చేసినట్లు మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. అకాల వర్షానికి అక్కెన పల్లి మదిర గ్రామమైన ఆరెపల్లి బుడగ జంగాల కాలనీలో కొన్ని ఇళ్లకు, గుడిసెలకు నీళ్లు రావడం తో అక్కడి ప్రజలకు ఇబ్బందిగా మారిందని చెప్పారు. వెంటనే బీఆర్ఎస్ నాయకులు మాజీ మంత్రి హరీశ్ రావు దృష్టికి తీసుకెళ్లగా మండల నాయకులతో నిత్యావసర సరుకులు పంపించారు. జాప శ్రీకాంత్ రెడ్డి మండల నాయకులతో కలిసి వెళ్లి బుడగ సంఘాల కుటుంబాలకు సరకులు పంపిణి చేశారు. హరీశ్ రావు కృషి తోనే బుడగ జంగాల కాలనిలో గతంలో డ్రైనేజీని నిర్మించుకున్నామన్నారు. అకాల వర్షం విపత్తును కూడా కావాలని రాజకీయం చేస్తూ వారి పబ్బం గడుపుతున్నారని పేర్కొన్నారు. నాడైనా, నేడైనా ఆపదలో ఉండేది కేవలం హరీశ్ రావేనని స్పష్టం చేశారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాగుల సారయ్య, సోసైటి చైర్మన్లు కోల రమేశ్ గౌడ్, ఎల్లంకి మహిపాల్ రెడ్డి, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు బద్దిపడగ కిష్టారెడ్డి,గ్రామ తాజా మాజీ సర్పంచ్ శ్రీమంతుల వెంకటేశం, మాజీ ఎంపీటీసీ బెదురు తిరుపతి, నాయకులు లక్ష్మారెడ్డి, సిద్దేశ్వర్ గౌడ్, ఉల్లి మల్లయ్య, వెంకట్ గౌడ్, చందు, అనిల్ హాజరైనారు.

నవరాత్రోత్సవాల్లో డీజేకు అనుమతుల్లేవు..









నవతెలంగాణ-బెజ్జంకి

గణేష్ నవరాత్రోత్సవాల్లో డీజేలకు అనుమతుల్లేవని పర్యావరణ పరిరక్షణకు మట్టి ప్రతిమలను ఏర్పాటుచేసి శాంతియుత వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలని తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ కార్యాలయంలో గణేష్ నవరాత్రోత్సవాల నిర్వహణపై పీస్ కమిటి పంచాయతీ కార్యదర్శులు, మండపాల నిర్వహకులతో సమావేశం ఏర్పాటుచేసి అవగాహన కల్పించారు. అనుమతులతోనే మండపాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు పీస్ కమిటీ హెచ్చరిం చారు. ఎంపీడీఓ ప్రవీన్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ ఏల్లయ్య గౌడ్, కానిస్టెబుల్లు శ్రీనివాస్, రాజేందర్ హజరయ్యారు.

నవ తెలంగాణ-మద్దూరు

భక్తిశ్రద్ధలతో గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించుకోవాలని. చేర్యాల సిఐ శ్రీను కోరారు. దూల్మిట్ట మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం వినాయక చవితి, మిలాద్ ఉన్ నబి, పండుగల సందర్భంగా హిందూ, ముస్లింలతో పీస్ కమిటీ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ జాతి, మతం, కులం, వర్గం, అనే బేధాలు లేకుండా అందరూ కలిసిమెలిసిగా ఉండాలని ఆయన కోరారు, హైదరాబాదులో మిలాద్ ఉన్ నబి ఏ రోజు నిర్వహిస్తారో ఆరోజు నిర్వహించుకోవాలని ఆయన తెలిపారు. మతసామరస్యాన్ని కాపాడుకుంటూ పండగలు చేసుకోవాలని ఆయన కోరారు. గణేష్ మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోని అనుమతి తీసుకోవాలన్నారు. నిమజ్జనం సమయంలో ఎవరు డీజేలు పెట్టకూడదని. డీజేలు పెడితే డీజేను సీజ్ చేసి నిర్వాహకులపై కేసులు పెడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మధుసూదన్, ఎస్సై షేక్ మహబూబ్, ఏ ఎస్ ఐ జిల్లా జగదీష్, పంచాయతీ కార్యదర్శి సిద్దేశ్వర్, మాజీ జెడ్పిటిసి నాచగోని పద్మ వెంకట గౌడ్, మాజీ ఉపసర్పంచ్ పోతరాజు మధు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హిందువులు వినాయక చవితి, ముస్లింలు మిలాద్ ఉన్ నబీ పండుగలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని సీఐ శ్రీనివాస్ అన్నారు. గురువారం హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ లో హిందూ ముస్లిం మత పెద్దలు, మండపాల ఆర్గనైజర్లతో పెద్దలతో సీఐ శ్రీనివాస్, ఎస్ ఐ మహేష్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వంలో అందరూ కలసి పండుగలు నిర్వహించుకోవాలన్నారు.అన్ని మతాలను కులాలను గౌరవించుకుంటూ సమాజంలో ముందుకు వెళ్లడం చాలా ముఖ్యమని తెలిపారు. యువతతో తల్లిదండ్రులు పెద్దలు కమ్యూనికేషన్ సత్సంబంధాలు కలిగి ఉండాలని తెలిపారు. ఏ సమస్య ఉన్న డయల్ 100 కు కాల్ చేయాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో హిందూ మత పెద్దలు, కేడం లింగమూర్తి, బొలిశెట్టి శివయ్య, బత్తుల శంకర్ బాబు, రాము, అనంత స్వామి, రవీందర్ గౌడ్, మల్లికార్జున్ రెడ్డి, రమ, రజిత, ముస్లిం పెద్దలు అన్వర్, మమ్మద్ హసన్, మహమ్మద్ పాషా మియా, అంతేక్, షబ్బీర్, యంఏ భారీ, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మద్దూరు

గణేష్ మండపాల ఏర్పాటులో నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మద్దూరు, దూల్మిట్ట, తహశీల్దారులు సంజీవ్ కుమార్, మధుసూదన్‌లు కోరారు ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రామ్మోహన్, అధ్యక్షతన గణేష్ మండపాల నిర్వాహకులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో తహశీల్దార్లు మాట్లాడుతూ గణేష్ మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఏర్పాట్లు చేసుకోవాలని వారు కోరారు. గణేష్ మండపాల వద్ద నిమజ్జనం రోజు డీజేలు పెట్టకూడదని వారు తెలిపారు. గణేష్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకునే ప్రతి ఒక్కరు ఆన్లైన్ చేసుకోవాలని ఆన్లైన్ చేస్తే ఏ గ్రామంలో ఎన్ని గణేష్‌లను ఏర్పాటు చేస్తున్నారని పోలీస్ వారికి తెలుస్తుందని వారు తెలిపారు. చెరువుల వద్ద గణేష్ నిమజ్జనం రోజు గజ ఈతగాలను ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు వారు సూచించారు. గణేష్ మండపాల వద్ద విద్యుత్ సరఫరా చేసుకునేందుకు విద్యుత్ అధికారులను సంప్రదించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై షేక్ మహబూబ్, ఏఈ సుధీర్ బాబు, ఏపిఎం బాబురావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

యువత గంజాయి మత్తుపదార్థాలకు బానిస కావద్దు

- గజ్వేల్ సీఐ బి.సైదా



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని విద్యార్థినీ, విద్యార్థులు గుర్తుంచుకొని ఇష్టపడి చదువుకొని ఉన్నతశిఖరాలకు ఎదగాలని గజ్వేల్ సీఐ బి.సైదా అన్నారు. గురువారం గజ్వేల్ గీతాంజలి జూనియర్ కాలేజ్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలు, గంజాయి, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ సైదా మాట్లాడుతూ మనిషి మనుగడకు చదువు, సంస్కారము, క్రమశిక్షణ, పెద్దలను, గురువులను గౌరవించడం చాలా ముఖ్యమన్నారు. మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, షీటీమ్ నిర్వహిస్తున్న విధుల గురించి విద్యార్థులు తెలిపారు. షీటీమ్ ద్వారా ఎలా రక్షణ పొందొచ్చు అనే అంశాలు ర్యాగింగ్, ఇవిటీజింగ్,పోక్సో, షీ టీమ్స్, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు,నూతన చట్టాల పై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, మాటలు నమ్మవద్దని, సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుందన్నారు.మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం మహిళల భద్రత తమ ముఖ్య బాధ్యతన్నారు. చదువుకునే సమయములో చెడు అలవాట్లకు బానిస కావొద్దని, ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించాలని తెలిపారు. డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గంజాయి డ్రగ్స్, మత్తు పదార్థాలు సేవించమని,సేవించే వారి సమాచారం పోలీసులకు తెలుపాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గీతాంజలి జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ మదుసుదన్ రెడ్డి,గజ్వేల్ షీటీమ్ బృందం శ్రీరాములు ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుల్ శ్యామల, లావణ్య , కానిస్టేబుళ్ల రాంచంద్రారెడ్డి, మహేష్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హస్టల్ విద్యార్థులకు డైట్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలి

- డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి



నవ తెలంగాణ-గజ్వేల్

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హస్టల్, గురుకుల, కేజీబీవీ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని కొరుతూ గురువారం డిప్యూటీ తహశీల్దారు బార్గవ్‌కు డిబిఎఫ్ అధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దాసరి ఏగొండ స్వామి మాట్లాడుతూ గజ్వేల్ డివిజన్ వ్యాప్తంగా వున్న ప్రభుత్వ గురుకుల, కేజీబీవీ, సంక్షేమ తదితర హస్టల్‌లలో ఎస్సీ ఎస్టీ, బిసి,మైనారిటీ తదితర పేద వర్గాలకు విద్యార్థిని విద్యార్థులు విద్యను ఆభ్యసిస్తున్నారన్నారు. ఈ విద్యాలయాలలో కనీస సదుపాయాలు కరువై నరకయాతన పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతో టిచర్ల,వార్డెన్ , ప్రవెట్ కాంట్రాక్టర్ల లదే ఇష్టారాజ్యాంగా మారడంతో పిల్లలు తమ సమస్యల పరిష్కారానికి రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితికి నెట్టబడుతున్నారన్నారు. ఇకనైన ప్రభుత్వం నిర్లక్ష్యం, వివక్షను విడనాడి ప్రభుత్వ విద్యాలయాలలో వసతులను మెరుగుపరిచి నాణ్యమైన విద్యాబోధన చేయాలని ఆయన కోరారు. ఇక కాస్మోటిక్ చార్జీలను అయితే పెంచక 16 సంవత్సరాలు దాటిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనానికి సైతం డైట్ చార్జీలు పెంచాలని కోరారు. గురుకులాలో విద్యార్థుల ఆత్మహత్యలను నివారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు,నాయకులు చంద్రం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోదారులు సహకరించాలి

- హుస్నాబాద్ ఏడీఈ శ్రీనివాస్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణంతోపాటు హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు హుస్నాబాద్ సబ్ స్టేషన్‌లోని 132/33 కేవీలో అత్యవసర పనులు కొరకు సప్లై నిలిపి వేస్తున్నట్టు హుస్నాబాద్ ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని రక్షిద్దాం

- కలెక్టర్ మను చౌదరి

నవతెలంగాణ-అక్కన్నపేట



మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని రక్షించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి అన్నారు. గురువారం అక్కన్నపేట మండల కేంద్రం లోని రైతు వేదికలో మహిళలకు మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ రసాయనాలతో తయారు చేసినటువంటి గణపతులను చెరువుల్లో వేయడం వల్ల వాటి నుంచి వచ్చే రసాయనాలు నీటిని కలుషితం చేస్తున్నాయని అన్నారు. దీనివల్ల చేపలు మరణిస్తున్నాయని తెలియజేశారు. కాబట్టి మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని అన్నారు. ప్రతి ఒక్కరు మట్టి గణపతులను పూజించాలని కలెక్టర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, సీసీలు శివచరణ్ సింగ్, తిరుపతి, రాజు వినీత్, సీఏలు సుమలత, మంజులా, మహిళా సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

నవతెలంగాణ-చేర్యాల



జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన ఉత్తమ ఉపాధ్యాయుడు చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలకు చెందిన కర్రోళ్ల విజయ్ కుమార్‌ను సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఉపాధ్యాయ శిక్షణ కేంద్రంలో గురువారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఈ.శ్రీనివాస్ రెడ్డి, మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన కర్రోళ్ల విజయ్ కుమార్‌ను టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి, జిల్లా కార్యదర్శి కొడిపల్లి ప్రశాంత్ కుమార్, డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు దేవులపల్లి కిష్టయ్య, ఎంఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మరాఠి సంతోష్, టీపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి చదరపల్లి నరేష్, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

రైతు సంఘాలకు అండగా ఉంటాం

- కలెక్టర్ ఎం. మను చౌదరి

నవతెలంగాణ-అక్కన్నపేట



ప్రసిద్ధ, ప్రహర్ష రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఆధ్వర్యంలో కృషి కల్ప సంస్థ సహకారంతో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి, అధిక లాభాలు పొందేలా కృషి చేయాలని కలెక్టర్ ఎం.మను చౌదరి పిలుపునిచ్చారు. గురువారం అక్కన్నపేట రైతు వేదికలో గండిపల్లి, మల్లంపల్లి పరిధిలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాల పాలకవర్గ సభ్యులు, ప్రకృతి పర్యావరణ సంస్థ ప్రతినిధులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దళారీ వ్యవస్థ కారణంగా రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు అవసరమైన అనుమతులు, సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. పంటలు నిల్వ, మార్కెటింగ్, అవకాశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నాబార్డు, ఉద్యాన, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు, పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం సంతోషం

- పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పుల్లగుర్ల రామచంద్రా రెడ్డి

నవతెలంగాణ-తొగుట



ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం తమ కెంతో సంతోషం కలిగిస్తుంద పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పుల్లగుర్ల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు ఎంపిక కావడంతో జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి హరీశ్ రావు చేతుల మీదుగా అవార్డు, శాలువతో సన్మానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పురస్కరించుకుని సమాజాభివృద్ధికి గురువుల పాత్ర ఎంతో కీలకమని అభిప్రాయం వ్యక్తం చేశారు. క్రమశిక్షణ, దేశభక్తి కలిగి సమాజాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. రాధాకృష్ణన్ సూచించిన మార్గంలో విద్యార్థులు నడుచుకుంటే భవిష్యత్ ఎంతో ఉన్నతంగా ఉంటుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన పొలాన్ని పరిశీలించిన ఏఈఓ

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షానికి రైతు చిట్టెల కొమురయ్యకు చెందిన వరి పొలం పూర్తిగా నీట మునిగి పాడైపోయింది. ఇట్టి పొలాన్ని గురువారం ఏఈఓ చంద్రప్రకాష్ పరిశీలించారు. ఈ సందర్భంగా వరి కోలుకోవడానికి తగిన సూచనలు చేశారు. ప్రస్తుతం వరి దుబ్బు చేసే దశలో ఉంది. బ్యాక్టీరియా, ఎండు ఆకు తెగులు ఆశించే అవకాశం ఉందని, కాబట్టి రైతులు 0.2 గ్రాములు ప్లాంటమైసిన్ మందును లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే కాండం కుళ్ళు రావడానికి కూడా అవకాశం ఉందని 2.5 గ్రా. కార్బెండజిమ్ అలాగే మ్యాంకోజెబ్ శిలీంద్రనాశక మందును లేదా ఒక మిల్లీలీటరు మైసిన్ వాలిడామైసిన్ కానీ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు.

ఫేస్ బుక్ కామెంట్ స్పందించిన కమిషనర్

నవతెలంగాణ-సిద్దిపేట

వీ మార్ట్ వెనక వైపున చెత్త పేరుకపోవడంతో వర్షం కారణంగా నీరు నిల్చింది, రోడ్డు లేకపోవటంతో వాహణదారులకు ఇబ్బందిగా ఉందని, చెత్త బండి రావడంలేదని ఫేస్ బుక్‌లో కామెంట్ ద్వారా శేఖర్‌గౌడ్ అనే వ్యక్తి కమిషనర్ దృష్టికి తీసుకరాగా, గురువారం ఉదయం కమిషనర్ ఆశ్రిత్ కుమార్ ఆ ప్రాంతానికి వెళ్లి, పారిశుద్ధ్య సిబ్బందితో మాట్లాడి, వాహనం ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. తప్పనిసరిగా ప్రతి రోజు చెత్త వాహనం రావాల్సిందేనని, చెత్త సేకరణ సమయానికి చేయకపోతే ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయని సానిటరీ ఇన్స్పెక్టర్‌లను ఆదేశించారు. ఫేస్ బుక్ కామెంట్‌కి స్పందించి నేరుగా తమ వద్దకు వచ్చి, సమస్య పరిష్కరించినందుకు శేఖర్ కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కమిషనర్ 7వ, 25వ వార్డుల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గుండ్ల యోగేశ్వర్, ముత్యాల శ్రీదేవి బుచ్చి రెడ్డి, మున్సిపల్ అధికారులు, సానిటరీ ఇన్స్పెక్టర్‌లు, తదితరులు పాల్గొన్నారు.



పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న ప్రజా ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ రాజలింగం,
- కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్

నవతెలంగాణ-చేర్యాల



పేదలకు ప్రజా ప్రభుత్వం ఆర్థిక భరోసాను కల్పిస్తుందని మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ అన్నారు. జనగామ నియోజకవర్గంలోని చేర్యాల, బచ్చన్నపేట మండలాలలోని వివిధ గ్రామాల్లో నిరుపేదలు వివిధ రకాల వ్యాధులతో బాధపడుతూ వైద్యానికి అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు కావడంతో బాధిత కుటుంబ సభ్యులు కిరణ్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకు రాగ వెంటనే ఆయన స్పందించి సీఎంఆర్ఎఫ్ ద్వారా నిధులను మంజూరు చేయించారు. మంజూరు అయిన పత్రాలను బాధితులు కమలాయపల్లి గ్రామానికి చెందిన అంజమ్మ, లెనిన్ నగర్ గ్రామానికి చెందిన డి.శ్రీనివాస్, చేర్యాల పట్టణానికి చెందిన శివశంకర్, బచ్చన్నపేట మండలం లోని కొన్నె కు చెందిన జి. రాకేష్‌లకు చేర్యాల మండల కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో గురువారం మాజీ ఎమ్మెల్యే రాజలింగం, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు కిరణ్ కుమార్, ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో చేర్యాల విజయ డైరీ చైర్మెన్ అంజిరెడ్డి, సిద్దిరాములు, ఎన్ఎస్‌యుఐ సతీష్, శనిగారి రవి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- దుబ్బాక ఐసీడీఎస్ సూపర్వైజర్ రాజేశ్వరి

నవతెలంగాణ-దుబ్బాక రూరల్



ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింత మహిళలు, చిన్నారులకు సమతుల్య పోషకాహారాన్ని పంపిణీ చేస్తుందని ఈ అవకాశాన్ని గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని దుబ్బాక ఐసీడీఎస్ సూపర్వైజర్ రాజేశ్వరి అన్నారు. గురువారం దుబ్బాక మండల పరిధిలో పద్మనాభునిపల్లి అంగన్వాడీ కేంద్రంలో పోషణ అభియాన్ (పోషణ మాసం) కార్యక్రమం గురించి గర్భిణీలు, బాలింతలకు వివరించారు. అనంతరం తక్కువ పిల్లలను గుర్తించి బాలామృతం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసి బాలామృతంలో పిల్లలు ఎదుగుదలకు, బాలింతలు ,గర్భిణీలు ఆరోగ్యంగా ఉండేందుకు అనేక రకాల పోషకాహార పదార్థాలు అందులో ఇమిడి ఉన్నాయని తెలిపారు. అనంతరం పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మహిళలకు వివరించారు. కార్యక్రమంలో సెక్రటరీ స్వామి, అంగన్వాడీ టీచర్ లావణ్య అలియాస్ పద్మ , ఆశ వర్కర్ సుభద్ర, ఆయా కవిత, చిన్నారులు, గర్భిణీలు , మహిళలు ఉన్నారు.

ఉపాధ్యాయులకు సమాజంలో ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది

- ఎమ్మెల్యే హరీశ్ రావు
- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను డీఈవోతో కలిసి సన్మానించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-సిద్దిపేట



ఉపాధ్యాయులకు సమాజంలో ఒక ప్రత్యేక స్థానం ఉందని ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీచర్స్ భవనంలో గురు పూజోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదిన సందర్భంగా గురుపుజోత్సవం నిర్వహించుకుంటామని, అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఎవరికి దొరకని గౌరవం ఒక ఉపాధ్యాయునికి దొరుకుతుందన్నారు. సిద్దిపేట జిల్లా ఉపాధ్యాయులు ఎప్పుడు సిద్దిపేట గౌరవాన్ని కాపాడారనీ, రాష్ట్రంలో పదవ తరగతి ఫలితాల్లో సిద్దిపేటను రెండవ స్థానంలో నిలిపారని అన్నారు. మన ఊరు మన బడి పనులను ఈ ప్రభుత్వం మధ్యలోనే ఆపేశారనీ, రాష్ట్రంలో 1700 ప్రభుత్వ పాఠశాలలు ఈ విద్య ఏడాది మూతపడ్డాయనీ అన్నారు. విద్యా వ్యవస్థ ఇంకా బలోపేతం కావాలనీ, ఉపాధ్యాయులకు నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయనీ అన్నారు. డీఎస్సీ ద్వారా రిక్రూట్ మెంట్ అయ్యే వరకు విద్యా వాలంటరీలను ఏర్పాటు చేయాలనీ కోరారు. గత ఐదు ఏళ్లుగా సిద్దిపేటను విద్య లో అగ్రగామిగా నిలుస్తున్నమని అన్నారు. ఇదే స్ఫూర్తి తో సమిష్టిగా కృషి, జిల్లాను మరింత అగ్రగామిగా నిలుపుదామన్నారు. జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓలు యాదవ రెడ్డి, శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్షాలకు నష్టపోయిన పంటలను పరిశీలించిన ఏడీఏ

నవతెలంగాణ-రాయపోల్



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన పంటలను వ్యవసాయ అధికా రులు నమోదు చేసుకుని ప్రభుత్వానికి నివేదిక పంపించడం జరుగుతుందని దుబ్బాక ఏడీఏ మల్లయ్య అన్నారు. గురువారం దౌల్తాబాద్ మండలం గాజులపల్లి గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు పంటలు చాలా వరకు దెబ్బతిన్నాయని, వర్షాల వల్ల నష్టపోయిన పంటలను పరిశీలించామన్నారు. మండల పరిధిలో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్ట వివరాలను నమోదు చేయాలని ఏఈఓలకు సూచించారు. పంట నష్టం జరిగిన రైతులు సంబంధిత వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. దెబ్బతిన్న పంట వివరాలను నమోదు చేసుకుని ప్రభుత్వానికి నివేదిక పంపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సంతోష్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల నిర్వీర్యంపై వైఖరి మార్చుకోవాలి

- ప్రభుత్వానికి స్వేరోస్ జిల్లాధ్యక్షుడు ఉప్పులేటి బాబు విజ్ఞప్తి
- ఎస్సీ గురుకుల కార్యదర్శిని తొలగించాలని డిమాండ్

నవతెలంగాణ-బెజ్జంకి



సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న అతిథి, పార్ట్ టైం సిబ్బంది తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం గురుకులాలను నిర్వీర్యం చేయడమేనని ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలని గురువారం స్వేరోస్ నెట్ వర్క్ జిల్లా_ధ్యక్షుడు ఉప్పులేటి బాబు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ వైఖరితో సుమారు 6 వేల మంది సిబ్బంది జీవనం అగమ్యగోచరంగా మారుతోందని, దళిత విద్యార్థుల భవిష్యత్తును వెనక్కి నెట్టే యత్నాన్ని ఉప్పులేటి బాబు ఖండించారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలలను నిర్వీర్యం చేసే ప్రభుత్వ వైఖరి మార్చుకుని ఎస్సీ గురుకుల కార్యదర్శిని వెంటనే తొలగించాలని బాబు డిమాండ్ చేశారు.

రుణమాఫీ కుటుంబ నిర్ధారణ సర్వే

నవతెలంగాణ-రాయపోల్



రేషన్ కార్డు లేనివిధంగా రుణమాఫీ జరగని రైతులను నిర్ధారించడం కోసం సర్వే నిర్వహించడం జరుగుతుందని దౌల్తాబాద్ మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్ అన్నారు. గురువారం దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామంలో రేషన్ కార్డు లేని రైతుల నిర్ధారణ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలతో రుణమాఫీ జరగని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని రేషన్ కార్డు లేకుండా రైతు రుణమాఫీ కానీ 401 రైతులు రాయపోల్ మండల వ్యాప్తంగా ఉన్నారని వారందరి ఆధారాలు, ధృవపత్రాలు తీసుకొని పై అధికారులకు పంపించడం జరుగుతుందన్నారు. మండల వ్యాప్తంగా రేషన్ కార్డు లేకుండా రుణమాఫీ జరగని రైతులందరూ తమ తమ వివరాలను వ్యవసాయ అధికారులకు అందించవలసిందిగా తెలిపారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయడమే లక్ష్యంగా పని చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ వెంకటరెడ్డి, ఏఈఓ సునంద, బీఆర్ఎస్ నాయకులు సూరంపల్లి కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ- రాయపోల్



ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో వృద్ధాప్య ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని ఆయుష్ డాక్టర్ నసీమా, వైద్యాధికారి డాక్టర్ మహారాజ్ అన్నారు. గురువారం రాయపోల్ మండల కేంద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయపోల్ మండలంలోని ప్రభుత్వం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వృద్ధాప్య ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఉచిత వైద్య శిబిరానికి వచ్చే వారు 40 ఏళ్ల పైబడి ఉండాలన్నారు. ఉచిత వైద్య శిబిరంలో మధుమేహం, రక్తపోటు, మోకాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, నడుము నొప్పి, అజీర్తి, కడుపులో మంట, మలబద్ధకం, అర్షమొలలు, దగ్గు, దమ్ము, స్త్రీ వ్యాధులు, మూత్ర సంబంధిత వ్యాధులకు, వైద్య పరీక్షలు చేసి మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్ర మంలో డాక్టర్ బానుతేజ, ఫార్మసిస్ట్ నరేష్, లింగం, విగ్నేశ్వ రి, ఎస్ఎన్ఓ రాజు, ఆసుపత్రి సిబ్బంది, పాల్గొన్నారు.

సతీష్ కుమార్‌ను విమర్శించే అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదు

- బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అన్వర్ పాషా

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



హుస్నాబాద్‌లో అభివృద్ధి చేసిన మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్‌ను విమర్శించే హరత కాంగ్రెస్ పార్టీ నాయకులకు లేదని బీఆర్ఎస్ పార్టీ పట్టణాధ్యక్షుడు అన్వర్ పాషా అన్నారు. గురువారం హుస్నాబాద్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఖమ్మంలో వరద బాధితులను పరామర్శించడానికి వెళ్లిన బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు దాడులు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రజా సమస్యలు పట్టించుకోకుండా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తుంటే అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ పట్టణం లోనీ మెయిన్ రోడ్‌లోకి వస్తున్న నీటిని మళ్లీ రాకుండా వచ్చే సంవత్సర కాలం వరకు కట్టడి చేయాలని మంత్రిని కోరితే కాంగ్రెస్ నాయకులు పస లేని విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం దాదాపు రూ.పది వేల కోట్లు ప్రభుత్వం నుంచి నిధులు తీసుక వచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన చరిత్ర మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ అన్నారు. కనీసం ఇప్పటి కైనా కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టణ అభివృద్ధి కోసం ఆలోచన చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొజ్జ హరీశ్, పాకాల శ్యాం సుందర్, రాజు నాయక్ ,బత్తుల జీవన్ జేరిపుతుల సునీత, దేవసల శ్రీనివాస్ రెడ్డి, పాల్గొన్నారు.

రెడ్డి జాగృతి మండల అధ్యక్షులుగా గల్వ దయాకర్ రెడ్డి

నవతెలంగాణ-రాయపోల్



రాయపోల్ మండల రెడ్డి జాగృతి అధ్యక్షులుగా రాయపోల్ మండల కేంద్రానికి చెందిన గల్వ దయాకర్‌రెడ్డి ఎంపికైనట్లు జిల్లా అధ్యక్షులు దేవుడి నరసింహ రెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా అధ్యక్షులు ఆయకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ పేద రెడ్డిల సంక్షేమం కోసం నా వంతు పాత్ర బాధ్యతాయుతంగా పోషిస్తానని, రెడ్డి జాగృతి సంఘం బలోపేతం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. రాయపోల్ మండల రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ప్రజలందరినీ ఏకం చేస్తానని తెలిపారు. నాపై నమ్మకముతో మండల అధ్యక్షులు బాధ్యతలు ఇచ్చిన జిల్లా అధ్యక్షులు దేవుడి నరసింహారెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు ఎడ్ల ఉప్పల్ రెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షులు బుట్టెంగారి మాధవరెడ్డి అలాగే నా ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

గ్రంథాలయాలను పాఠకులు ఉపయోగించుకోవాలి

నవతెలంగాణ-సిద్దిపేట



పాఠకులు గ్రంథాలయాలను ఉపయోగించుకొని, ఉన్నతు లుగా ఎదగాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ నూతన కార్యదర్శి ఎం.సుధీర్ అన్నారు. గురువారం సిద్దిపేటలో జిల్లా గ్రంథాలయ సంస్థలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కార్యదర్శిగా పనిచేసి, ఉద్యోగ విరమణ చేసిన ఏవిఎస్ రాజును గ్రంథాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. అనంతరం నూతన కార్యదర్శి సుధీర్ మాట్లాడుతూ నిశ్శబ్ద దేవాలయాలైన గ్రంధాల యాలు సమాజ ానికి అవసరమని అన్నారు. వాటి అభివృద్ధి కోసం ఏబీఎస్ రాజు చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయపాలకులు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం











నవతెలంగాణ -నంగునూరు

జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయుడు నంగునూరు ఉన్నత పాఠశాల చెందిన గొట్టిపర్తి రామస్వామి గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. గురువారం సిద్దిపేట టీటీసీ భవన్‌లో జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు చేతుల మీదుగా సన్మానం పొందారు. అదేవిధంగా నంగునూరు మండలం నర్మెట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గొట్టిపర్తి శ్రీనివాస్ గౌడ్‌ను కూడా సన్మానించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులుగా సన్మానం పొందడంతో పలువురు అభినందనలు తెలియజేశారు.

నవతెలంగాణ-తొగుట

మండలం నుంచి నలుగురు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందారు. గురువారం గుడికందుల ఉన్నత పాఠశాల నుంచి ఎల్. భిక్షపతి, వెంకట్రావు పేట ఉన్నత పాఠశాల నుంచి మురళీధర్, యూపీఎస్ పెద్ద మాసానిపల్లి దుర్గరెడ్డి, పీఎస్ వడ్డెర కాలనీ నుంచి పి.రామచంద్రా రెడ్డిలు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైనందునా సన్మానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ హర్షిశలు విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడుతున్న మండల పరధిలోని ప్రతి ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు.

నవతెలంగాణ-రాయపోల్

సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం జిల్లా వ్యాప్తంగా ఎంపికైన ఉపాధ్యాయులకు గురువారం జిల్లా కేంద్రం సిద్దిపేట టీటీసీ భవనంలో ఘనంగా సన్మానం చేశారు. దానిలో భాగంగానే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన రాయపోల్ మండలం బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీవశాస్త్రం ఉపాధ్యాయురాలు యం.వసంత, కొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాల సిహెచ్. రమాదేవి, బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్లం ఉపాధ్యాయులు నర్సింలు గౌడ్‌లను మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు, జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, రాయపోల్ మండల విద్యాధికారి నరసమ్మ చేతుల మీదుగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుడి బడి అడుగులతో పాఠశాలలో చేరిన బాల్య దశలో అక్షర జ్ఞానం కల్పించి విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసి అజ్ఞానమనే చీకటిని తరిమికొట్టి విజ్ఞానవంతులుగా తీర్చిదిద్ది ప్రపంచానికి పరిచయం చేసే వారే ఉపాధ్యాయులు అన్నారు. కుల మత భేదలు, ధనిక పేద వ్యత్యాసాలు లేకుండా అందరికీ సమానమైన జ్ఞానాన్ని అందిస్తారని అటెండర్ క్లర్క్ నుంచి మొదలుకొని రాష్ట్రపతి ప్రధానమంత్రి, ఐఏఎస్, ఐపీఎస్ వరకు కూడా ప్రతి ఒక్కరు ఉపాధ్యాయుల వద్ద విద్యను అభ్యసించడం వల్లనే ఆ స్థాయికి చేరుకోగలుగుతారు. అలాంటి ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శవంతులు అన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని నా ఎంపిక పట్ల కృషిచేసిన ప్రతి ఒక్కరికి అలాగే ఈ రోజు ఇంత పెద్ద ఎత్తున సత్కరించిన అతిథులందరికీ పేరు పేరున ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు మరింత బాధ్యత పెంచిందని ఇకమీదట ఇంకా ఎంతో ఉత్సాహంగా పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు వివిధ సంఘాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుబ్బాక

డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం పురస్కరించుకుని గురువారం మండల వనరుల కేంద్రం ఆధ్వర్యంలో దుబ్బాకలోని ఎంపీడీవో కార్యాలయంలో 'గురుపూజోత్సవం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 23 మంది ఉపాధ్యాయులను దుబ్బాక తహసీల్దార్ నల్ల వెంకటరెడ్డి, మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్ కుమార్, ఎంపీడీవో వేలేటి భాస్కర శర్మ, ఎంఈఓ జోగు ప్రభుదాస్ చేతుల మీదుగా శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పలు ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నవతెలంగాణ -నంగునూరు

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నంగునూరు మండలం నర్మెట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహిం చారు. మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయు వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. ఉపాధ్యాయులందరూ విద్యార్థులకు నాణ్యమైన విద్య ఉత్తమ పౌరులు తీర్చిదిద్దాలని సూచించారు. నంగు నూరు మండలం నుంచి 9 మంది ఉత్తమ ఉపాధ్యాయులు ,ఒక సీఆర్పీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ ప్రభాకర్ రావు, ఉపాధ్యాయ సంఘంప్రతినిధులు పార్థసారథి, హరికృష్ణ, జైపాల్, మనీష్ కుమార్, నర్సయ్య, బాలకిషన్, ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, మండలంలోని ఉపాధ్యాయ బృందం, పాల్గొన్నారు

పెచ్చులూడిపోయిన పాఠశాల భవనం

నవతెలంగాణ - రాయపోల్

ప్రమాదవశత్తు పాఠశాల భవనం పైకప్పు పెచ్చులు ఊడిపోయి కింద పడగా పెను ప్రమాదం తప్పింది. గురువారం మధ్యాహ్నం రాయపోల్ మండలం వీరానగర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల భవనం రెండు అంతస్తులు ఉండగా, కింది అంతస్తు పైకప్పు శిథిలావస్థకు చేరి ఒకేసారి భారీ మొత్తంలో పైకప్పు కూలిపోయింది. ఆ సమయంలో విద్యార్థులు ఉపాధ్యాయులు ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం మౌలిక వసతులను కల్పించడం కోసం అధిక ప్రాధాన్యత నిస్తుందని గొప్పలు చెబుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసింది. పాఠశాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేయడం కోసం నిధులు మంజూరు చేశారు. అయినప్పటికీ పాఠశాలలో పూర్తిస్థాయిలో పనులు జరగడం లేదు. అందుకే ప్రభుత్వ పాఠశాల పరిస్థితి ఇలా అధ్వానంగా తయారయింది. అదే సమయంలో పెచ్చులు ఊడిపోయిన ప్రదేశంలో విద్యార్థులు కానీ ఉపాధ్యాయులు కానీ ఉంటే చాలా పెద్ద ప్రమాదం జరిగేది. కాబట్టి వెంటనే అధికారులు స్పందించి పాఠశాల మరమ్మత్తులు చేపట్టి ఇలాంటి సంఘటన జరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు హెచ్చరించారు.

సమాజంలో ఉపాధ్యాయుడి పాత్ర గొప్పది

నవతెలంగాణ-అక్కన్నపేట



సమాజంలో అన్ని వృత్తుల్లో కెల్లా ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదని, ఉపాధ్యాయ వృత్తి ద్వారానే అనేకమందిని తయారు చేయవచ్చని వీఎంఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వంగ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. అక్కన్నపేట మండలం గౌరవెల్లి ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడు ద్వారానే ఏమైనా సాధించవచ్చని అభిప్రాయ పడ్డారు. ఉపాధ్యాయులు చెప్పిన సూచనలను, సలహాలు పాటిస్తూ ముందుకెళ్తే భవిష్యత్తులో చక్కటి స్థితికి చేరుకుంటామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పనలో భాగంగా రూ. 20వేల విలువగల మైక్ సెట్‌ను అందదేశారు. అనంతరం ఉపాధ్యాయులందరిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతి, ఉపాధ్యాయులు, ఏపీఆర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మెన్ రేణుక శ్రీనివాస్,విద్యార్థులు, పాల్గొన్నారు.

నవతెలంగాణ
6
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
శుక్రవారం | 06 సెప్టెంబర్ 2024 | www.navatelangana.com

అందోల్‌లో గురుపూజోత్సవం



నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండలంలోని జోగిపేటతో పాటు ఆయా గ్రామాలలో ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల్లో గురువారం గురుపూజోత్సవం సందర్భంగా ఆయా పాఠశాలల విద్యార్థులు ఉపాధ్యాయులను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. జోగిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ రజిత ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఇందులో అధ్యాపకులు విట్టల్, శ్రీనివాస్, శ్రవణ్ కుమార్, మల్లేశం, గోవర్ధన్ రెడ్డి, మల్లేశం, శశికళ, ప్రసన్న లత, రషీద్ నర్సింలు, గౌస్ ఉద్దీన్ పాల్గొన్నారు. మండల పరిధిలోనీ. అల్మాయిపేట గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు శివరాజ్, బసంతారావు తదితరులను మాజీ సర్పంచ్ రవిశంకర్ ఆధ్వర్యంలో శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఇందులో గ్రామవాసులు మల్లేశం, పెంటయ్య, దేవయ్య, సిహెచ్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు. .

పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ పర్యటించి వర్షాలకు నష్టపోయిన పంట పొలాలను పరిశీలించారు . గురువారం జహీరాబాద్ మండలం పస్తాపూర్ తమ్మడపల్లి కొత్తూరు తదితర గ్రామాలను సందర్శించి గత వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు నష్టపోయిన పెసర, మినుము సోయా పత్తి పంటలను జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ పరిశీలించి నష్టపోయిన పంటల వివరాలను సేకరించి సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ సహాయ సంచాలకులు బిక్షపతి, వ్యవసాయ విస్తరణ అధికారులు రాజు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పండగలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలి



ఎమ్మెల్యే మాణిక్ రావు

నవతెలంగాణ-జహీరాబాద్

పండగలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎమ్మెల్యే మాణిక్ రావు అన్నారు. గురువారం సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డితో కలిసి డివిజన్ స్థాయి సమావేశాన్ని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించి ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయక నిమజ్జనం, మీలాద్ ఉన్ నబి పండుగలు ఒకే సారి రావడంతో సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. గణేష్ ఉత్సవాలు ప్రారంభం నుంచి ముగిసేంత వరకు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్ శాఖ వారు, గణపతి మండపాల పరిసర ప్రాంతాలలో పరిశుభ్రంగా ఉంచాలని అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. వినాయక నిమజ్జనానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని, శోభాయాత్ర జరిగే రూట్లలో గుంతల మరమ్మతులు చేసి విగ్రహాల తరలింపులో ఆటంకం లేకుండా అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం చేయాలన్నారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూడాలని పోలీసు శాఖ చూడాలన్నారు. నారింజ వద్ద, పట్టణ ప్రధాన కూడళ్లలో లైట్లు, మండపాల వద్ద కరెంట్ తీగలు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజు, డి.ఎస్.పి రామ్మోహన్ రెడ్డి లతోపాటు వివిధ శాఖల అధికారులు, మాజీ మున్సిపల్ చైర్మన్ గుప్తా, మురళి కృష్ణ గౌడ్, మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప , మాజి మున్సిపల్ చైర్మన్ తన్జిం, మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ,మాజి పట్టణ అధ్యక్షులు యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



నవతెలంగాణ-గుమ్మడిదల :

మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయ వక్తలు మాట్లాడుతూ సమాజంలో ఎందరో విద్యార్థులను ఉన్నత శిఖరాలకు అధిరోహించే విధంగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ప్రతి ఒక్కరూ సర్వేపల్లి రాధాకృష్ణను ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని కోరారు. బొంతపల్లి పాఠశాలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఎంపీ రఘునందన్ రావు ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, ఎమ్మెల్యే చింత ప్రభాకర్, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ డీఈవో వెంకటేశ్వర్లు పదాధికారుల చేతుల మీదుగా విశ్వనాథం, రాంబాబు, మేమెంటో ప్రశంస పత్రాలను అందుకున్నారు ఈ సందర్భంగా ఎంపి రఘునందన్ రావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న ప్రతి ఒక్కరూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణను ఆదర్శంగా తీసుకొని పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ కార్యాలయాను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



నవతెలంగాణ-మునిపల్లి

మండల కేంద్రమైన మునిపల్లిలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ వివిధ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదటగా మండల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి అక్కడ వైద్య వైద్య సదుపాయాలను అక్కడ రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలుర వసతి గృహాన్ని ఆదర్శ పాఠశాలను సందర్శించారు. అక్కడ విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను ఎదుర్కొంటున్న సమస్యలను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహానికి 25 బెడ్‌లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆదర్శ పాఠశాల, హాస్టల్‌కు మిషన్ భగీరథ పథకం ద్వారా మంచినీటి సదుపాయం కనెక్షన్ ఇవ్వాలని ఎంపీడీవో హరి నందన్ రావుకు సూచించారు. స్థానిక తహసీల్దార్ ఆశాజ్యోతి , మండల పరిషత్ అభివృద్ధి అధికారి హరి నందన్ రావు, మండల విద్యాధికారి దశరథ్ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ భాస్కర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు

గురువులు సమాజ నిర్దేశకులు



నవతెలంగాణ-జిన్నారం

గురువులు సమాజ నిర్దేశకులని సృజనాత్మకతను వెలికి తీసి విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేసే గొప్ప మార్గదర్శకులని సీఐ సుధీర్ కుమార్ అన్నారు. మండల కేంద్రమైన జిన్నారంలో గల ప్రతిభ విద్యానికేతన్ హై స్కూల్లో గురువారం ప్రిన్సిపల్ సార శ్రీనివాస్ అధ్యక్షతన ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి సీఐ సుధీర్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాస్ అధ్యాపక బృందాన్ని ఆయన సన్మానించారు. ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతిభ విద్యానికేతన్ విద్యార్థులు సృజనాత్మకమైన మేధోవంతమైన విశ్లేషణతో అన్ని రంగాల్లో గొప్పగా రాణిస్తుండడం సంతోషంగా ఉందని విద్యార్థి అధ్యాపక బృందాన్ని అభినందించారు. ఆంజనేయులు, ప్రతిభ విద్యానికేతన్ అధ్యాపక బృందం సంతోష్ కుమారి సునీల్ కుమార్ మానస మమత దీపిక సౌందర్య సౌమ్య శోభారాణి అరుణ శైలజ విద్యార్థి బృందం పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ఉపాధ్యాయులకు అవార్డులు



నవతెలంగాణ-సంగారెడ్డి

సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా సంగారెడ్డి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల కు సన్మాన కార్యక్రమం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులు ఎంపిక అయ్యారు. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, టి జి ఐ ఐ సి చైర్మన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి చేతుల మీదగా అవార్డులను అందుకున్నారు. అవార్డు అందుకున్న వారిలో ఎం. రత్నరాజు, జి ఆర్ వి ఆర్ శేఖర్, జె.లీలావతి, ఎం.స్వర్ణలత, జయలత, గణపతి ఉన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



నవతెలంగాణ-కోహిర్

మండల పరిధిలోని పీచెర్యాగడి ఉన్నత పాఠశాలలో మాజీ విద్యా కమిటీ చైర్మన్ కృష్ణ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్ మాట్లాడుతూ విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు నేర్పి వారిని సంస్కారవంతంగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దత్తాత్రేయ సార్, గురు లింగయ్య సార్, వలి సార్, ఎల్సి టీచర్, పద్మయ్య సార్, స్వాతి టీచర్, శరణప్ప పాల్గొన్నారు

నవతెలంగాణ -సదాశివపేట : మండలంలోని నందికంది ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎన్.శంకర్ పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను మార్గ నిర్దేశం చేసేది గురువులేనని శంకర్ తెలిపారు. సమాజంలో ప్రత్యేక స్థానం ఉందని, గురువులు చెప్పే ప్రతి అంశాన్ని ఎప్పటికప్పుడు చదువుకొని ఉన్నత స్థానంలోకి రావాలని విద్యార్థులకు మార్గనిర్దేశనం చేశారు. పాఠశాలలో విద్యార్థులు టీచర్స్ ను ఘనంగా సన్మానం చేసి గురుభక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వినయ కుమార్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బసవయ్య, సిఆర్పిలు రాజేశ్వర్,ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు............



ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం

















నవతెలంగాణ-మద్దూరు

డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవాన్ని లద్నూర్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదానోపాధ్యాయులు పోకల రవిందర్ మాట్లాడుతూ రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తి నుంచి ఉపరాష్ట్రపతిగా ఉన్నత పదవులు అధిరోహించారని ఆయన తెలిపారు ఉపాధ్యాయులందరూ ఆయన అడుగు జాడలలో నడవాలని ఆయన తెలిపారు. అదేవిధంగా మద్దూరు దూళ్మిట్ట మండలాల్లోని అన్ని పాఠశాలల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె. ప్రతాప్, కె. ఉపెందర్, సిహెచ్. విష్ణుమూర్తి, ఆర్. రాజమల్లు, ఝాన్సీ అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మర్కుక్

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఎం.సిద్దయ్య, ఎ.కనకరావులను తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, వందన, శ్రీనివాసరావు, రమణారావు, పద్మారెడ్డి, బుచ్చయ్య, వెంకటేష్, రామకృష్ణ రెడ్డి, బాలకిషన్, నర్సింలు, స్వాతి, జ్యోతి, మాధవి తదితరులున్నారు.

నవ తెలంగాణ-గజ్వేల్

ప్రభుత్వ డిగ్రీ కో ఎడ్యుకేషన్ కళాశాలలో గురుపూజోత్సవాన్ని విద్యార్థిని, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నిక్హత్ అంజు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రిన్సిపాల్‌తో కేక్ కట్ చేయించారు. తదనంతరం అధ్యాపకులందరినీ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. నికత్ అంజుమ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న చీకటి, అజ్ఞానం, అంధకారాలను తొలగించడమే గురువుల ఏకైక లక్ష్యమన్నారు. ఏ యుగంలోని విద్యార్థికి అయినా జ్ఞానం కల్పించి వారికి బంగారు భవిష్యత్తు నిర్మించడమే ఉపాధ్యాయుల తమ ప్రథమ కర్తవ్యం గా భావిస్తారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు నిరంతరం కొవ్వొత్తి వలె కరిగిపోతూ విద్యార్థులకు వెలుగును అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు తమ భవిష్యత్తును అద్భుతంగా మలుచుకొని తమ కాళ్లపై తాము నిలబడడమే గురువులకి వారిచ్చే నిజమైన గురుదక్షిణం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎస్. గణపతి రావు, అకాడమిక్ కోఆర్డినేటర్ లక్ష్మీనరసయ్య, ఐ.క్యు. ఏ.సి కోఆర్డినేటర్ డా. వెంకటేశం, స్పోర్ట్స్ ఇన్చార్జి విజయభాస్కర్ రెడ్డి, ఎ. సి. సి కోఆర్డినేటర్ డా. ఆర్. మహేందర్ రెడ్డి, ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్స్ డా. మహేందర్, డా. వై. రామచంద్రం, డా. పెద్దిరాజు, వి. మార్కండేయ, డా. అలివేలు, డా. కవిత, అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నంగునూరు

ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన మహనీయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని నంగునూరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ కె.అనిల్ కుమార్ అన్నారు.గురువారం నంగునూరు మండలంలోని వివిధ పాఠశాలల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. నంగునూరు ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బ్యాంక్ మేనేజర్ ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయునికి ఎనలేని గౌరవం ఉంటుందన్నారు. నేటి ఉపాధ్యాయులు సర్వేపల్లిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. గట్లమల్యాల ఉన్నత పాఠశాలలో గ్రామ యువ నాయకుడు గాండ్ల రమేశ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్దిపేట

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పూజల గోపికృష్ణ గురువులను(ఉపాధ్యాయులను) ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి, సమాజానికి ఉత్తమ పౌరులను అందించే అనిర్వచనీయమైన పాత్రను ఉపాధ్యాయులు పోషిస్తున్నారని అన్నారు. గురువే ప్రపంచానికి అధిపతని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి కలిముద్దీన్, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాహబ్, యస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు అజ్మత్, మెరుగు రాజు, మైపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-వర్గల్

మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలతో అలంకరించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు గురువు యొక్క గొప్పదనాన్ని గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలోని ఉపాధ్యాయులకు గ్రామస్తులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఆనంద్ కుమార్, ఈశ్వరమ్మ, సుభాష్ గౌడ్, సత్యనారాయణ, భాస్కర్, పద్మ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-రాయపోల్

విద్యార్థులను అజ్ఞానం నుంచి జ్ఞానం వైపు నడిపేవారు ఉపాధ్యాయులు అలాంటి ఉపాధ్యాయులు నవసమాజ నిర్మాణకులని ఇందుప్రియాల్ అంగన్వాడీ టీచర్ మహమ్మద్ సుల్తాన అన్నారు. గురువారం దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ అంగన్వాడీ కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తి నుంచి మొదలుకొని భారత రాష్ట్రపతిగా ఎదిగి దేశానికి సేవలు అందించారు. తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు నిర్మాణం అవుతుందని రాబోయే తరానికి విద్య వినయం క్రమశిక్షణతో పాటు భవిష్యత్ కాలంలో విలువలతో కూడిన జీవన విధానంపై విద్యార్థులు అవగాహన కల్పించాలన్నారు. సేవ చేసే వారందరిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయమ్మ పెంటమ్మ, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మద్దూరు

ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైందని మద్దూరు మాజీ జెడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా దూళ్మిట్ట మండలంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల, ప్రాథమిక ఉన్నత పాఠశాల, జాలపల్లి ప్రాథమిక పాఠశాలలోని ఉపాధ్యాయులను ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తన సొంత ఖర్చులతో ఉపాధ్యాయులను శాలువా, మెమొంటాలతో సన్మానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ పౌరులను తయారు చేసే గొప్ప వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని అన్నారు. ఉపాధ్యాయులకు ఎంత చేసిన తక్కువేనని తెలిపారు. తనకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ అధ్యక్షుడు చెట్కూరి కమలాకర్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని పోతారం గ్రామంలో మూతపడిన ప్రాథమిక పాఠశాల పునఃప్రారంభంలో 10 మంది విద్యార్థులకు విద్యా బోధన అందిస్తున్న ఉపాధ్యాయుడు రమేశ్‌ను ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ మండలాధ్యక్షుడు నారోజు శంకరా చారి శాలువా కప్పి గురువారం ఘనంగా సన్మానించారు. అనంతరం శంకరా చారి స్వంత ఖర్చులతో సహపంక్తి భోజనం ఏర్పాటుచేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు,విద్యార్థులు పాల్గొన్నారు.

-విద్యావనరుల కార్యాలయంలో..

మండల కేంద్రంలోని విద్యా వనరుల కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన నాగయ్య, భరత్ రెడ్డి, ఎండీ నజీర్, రవీందర్ రెడ్డిని ఉపాధ్యాయ సంఘాల ఉద్యోగులు శాలువ కప్పి సన్మానించారు. ఎంపీడీఓ ప్రవీన్, ఎంఈఓ పావని, ఏపీఎం నర్సయ్య, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అక్కన్నపేట

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో గురువారం అక్కన్నపేట మండలంలోని అంతక పేట జిల్లా పరిషత్ స్కూల్లో ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీఎం శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఇచ్చేది ఉపాధ్యాయులే అని, దేవుళ్ళు కనిపిస్తారో లేదో కానీ ఉపాధ్యాయులు మన ముందు కనిపించే దేవుళ్ళని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీసీలు తిరుపతి, శివ చరణ్ సింగ్, రాజు, మండల సమాఖ్య అధ్యక్షురాలు మమత, సీఏ మంగాదేవి, స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు అంజలి, టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చేర్యాల

జ్ఞాన జన్మను ఇచ్చేది గురువులే అని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం చేర్యాల మండలం అర్జునపట్ల గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 10వ తరగతి విద్యార్థినీ వైష్ణవి సర్వేపల్లి వేషధారణ, ఆయన మాట, పనులను కళ్ళకు కట్టినట్లుగా చేశారు. విద్యార్థులే గురు వందనం పేరుతో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశోక్, సుదర్శన్ రెడ్డి, కులకర్ణి, రామచంద్ర మూర్తి, రజిత, సత్యనారాయణ, సాదుల్ల, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు సేవలు అందించడంలో ఎప్‌పీఓల పాత్ర కీలకం

- కూరగాయ సాగులో ఫసల్ డివైస్ మిషన్ బేష్
- వెంకటాపూర్‌లో రైతు వెంకటేష్ సాగు చేసిన విధానం పరిశీలన
- కలెక్టర్ ఎం.మను చౌదరి




నవతెలంగాణ -సిద్దిపేటరూరల్

రైతులకు సేవలు అందించడంలో ఎఫ్‌పీఓ ల పాత్ర కీలకమని కలెక్టర్ ఎం మను చౌదరి అన్నారు. గురువారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో రైతు వెంకటేష్ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ద్వారా పండించిన పంటలను ఫౌండేషన్ సీఈవో సీఎం పాటిల్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో వివిధ పంటలను పండించిన విధానం అడిగి తెలుసుకున్నారు. బుస్సాపూర్ వెంకటాపూర్‌లో టమాటా, మిర్చి, బీర, కిరా, కూరగాయల సాగు ఎక్కువ చేస్తామని గత రెండు మూడు ఏళ్ల నుంచి లాభసాటిగా ఉందని తెలిపారు. పంట సాగులో ఫసల్ డివైస్ మిషన్ చాలా ఉపయోగపడుతుందని పంటకు సంబంధించి వాతావరణంలోని ఉష్ణోగ్రత, వర్షసూచన, తోటలలో చీడ పీడ ఇతర రోగాలను ముందే గుర్తించడం వాటి నివారణకు మందుల పేర్లు, తోటకు కావాల్సిన నీటి శాతం గూర్చి ఫోన్‌లో ఫసల్ యాప్ ద్వారా పూర్తిగా నేరుగా రైతుకు సమాచారం అందిస్తుందని తెలిపారు. డ్రిప్పు, మ్యాచింగ్ పేపర్, ట్రక్కర్, ప్రభుత్వం తరపు నుంచి సబ్సిడీ ఇప్పించాలని అదేవిధంగా మార్కెట్లో బయట రాష్ట్రాల నుంచి వచ్చే టమాటా రాకుండా గ్రామాల్లో టమోటాని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. రైతులు అడిగిన వాటికి కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఉద్యానవ శాఖ అధికారులు ఎల్లప్పుడు అందుబాటులో ఉండేలా, మార్కెట్ కంపెనీలతో రైతులకు లాభాలను వచ్చే విధంగా గురించి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రాధిక, జిల్లా ఉద్యానవ శాఖ అధికారి సువర్ణ, నాబార్డు డిడియం నిఖిల్, మండల వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు ఎఫ్‌పీఓ సీఈవో భాస్కర్ డైరెక్టర్లు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కొడకండ్ల స్కూల్‌లో గురుపూజోత్సవం

- పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులకు సత్కారం



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

గజ్వేల్ మండల పరిధిలోని కొడకండ్ల గ్రామంలో పవన్ కళ్యాణ్ యూత్ పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయులందరికీ శాలువాతో సత్కారం చేశారు. గురువారం కొడకండ్ల పాఠశాలలో ఉపాధ్యాయులందరినీ సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మధునాల శ్రీనివాస్ మాట్లాడుతూ యూత్ ఈ విధంగా వచ్చి విద్యార్థులందరికీ ప్రోత్సాహకాలు అందించడం వారి సేవా దృక్పథానికి నిదర్శనం అని కొనియాడారు. పూర్వ విద్యార్థులు గురువులను పూజించడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. పాఠశాలలో ఉన్న విద్యార్థులందరికీ పలకలు, నోటుబుక్కులు, పెన్నులు, అరటి పండ్లు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రహేళ్ల, కల్పన, పవన్ కళ్యాణ్ యూత్ అధ్యక్షులు వంశీ, మెంబర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణ కౌన్సిలర్ సాయన్న గారి సుందర్ కుమారుడు యువ నాయకుడు లిఖిత్‌కు ఇటీవల కాలుకి తీవ్ర గాయం అయి చికిత్స పొందగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న మహిళా నాయకులు అర్చన రెడ్డిని పరామర్శించి, తన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. 1వ వార్డ్ లింగారెడ్డి పల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కదుర్ల రాజేశం తండ్రి ఐలయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మరణించగా, వారి కుటుంబ సభ్యులను పరమర్శించారు.

ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్



నవతెలంగాణ-రాయపోల్

సైబర్ నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, గంజాయి ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్ అన్నారు. గురువారం దౌల్తాబాద్ మండలం దొమ్మాట గ్రామంలో సైబర్ నేరాల పట్ల, గంజాయి ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి ఇతర మత్తు పదార్థాలు వాడకం, మహిళల రక్షణ, షీ టీమ్స్ పనితీరు వంటి అంశాల గురించి, ర్యాగింగ్, ఇవిటీజింగ్, పోక్సో, యాంటీ హ్యుమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి తెలిపారు. అపరిచిత వ్యక్తుల యొక్క ఫోన్ కాల్స్, మాటలు నమ్మవద్దు, సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుందన్నారు. మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. మహిళల భద్రత మా ముఖ్య బాధ్యత. యువత చదువుకునే సమయములో చెడు అలవాట్లకు బానిసకావద్దన్నారు. డ్రగ్స్,గంజాయి ఇతర మత్తు పదార్థాల అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపక్కన పడేసిన కోళ్లు దుర్వాసనతో ప్రయాణికుల ఇక్కట్లు



నవతెలంగాణ-రాయపోల్

గుర్తుతెలియని వ్యక్తులు పౌల్ట్రీ ఫామ్‌లో మృతి చెందిన కోళ్లను రోడ్డు పక్కన పడి వేయడంతో గజ్వేల్- చేగుంట రోడ్డు మార్గంలో ప్రయాణించే ప్రయాణికులకు దుర్వాసనతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం రాత్రి రాయపోల్ మండలం వడ్డేపల్లి గుర్రాల సోఫా సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు డీసీఎం లోడ్ మృతి చెందిన ఫారం కోళ్లను తీసుకువచ్చి రోడ్డు పక్కన పడేసి వెళ్లారు. గురువారం ఉదయం నుంచి తీవ్రస్థాయిలో దుర్వాసన వెదజల్లుతు న్నాయి. అలాగే మృతి చెందిన కోళ్లను కుక్కలు ఆహారంగా తీసుకుంటున్నాయి. ఇలాంటి ఫారం కోళ్ల మాంసం తినడానికి అలవాటు పడిన కుక్కలు కోళ్ల మాంసం దొరికిన సమయంలో మనుషులపై దాడి చేస్తున్నాయి. ఈ దుర్వాసన ఇంకా చాలా రోజులు ఇలాగే వెదజల్లుతుంది కాబట్టి వెంటనే అధికారులు స్పందించి ఇక్కడ కోళ్ళు వేసిన వ్యక్తులను గుర్తించి అక్కడ నుంచి మృతి చెందిన కోళ్లను తీయించాలని, గ్రామాలకు దూరంగా పెద్ద గొయ్యి తీసి పూడ్చివేయాలని ప్రయాణికులు వాపోతున్నారు.

నారాయణ పాఠశాలలో సర్వేపల్లి రాధాక్రిష్ణన్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలోని నారాయణ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. 9,10 వ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి అన్ని తరగతుల విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జీఎం గోపాల్ రెడ్డి, ఏటీఎం వల్లి కుమార్ గౌరవ అతిథులు కనకరాజు, రాధిక, వనిత, ప్రిన్సిపల్ లక్ష్మణ్, ఏడి అశోక్ రాజ్, విపి లు తేజస్వి, శ్వేత, ఉపాధ్యాయ బృందం, - విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా ప్రిన్సిపల్ లక్ష్మణ్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ లక్ష్మణ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ 'ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర మహోన్నత మైనదని, విద్యార్థి జీవితంలో తల్లి దండ్రుల తరువాతి స్థానం ఉపాధ్యాయునిదేనని తెలియజేశారు.